ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : జి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 సంచిక : 1 సెప్టెంబర్ 2023

## ఈ సంచికలో. . . .

ప్రేమ స్వరూపం శ్రీ నాన్నగారు ...................................... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 5

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



**ప్రపంచంలో ఉన్న దుఖం అంతా వచ్చి మీద పడిపోయినా కూడా నిర్వికారంగా నిర్విషయంగా ఎవరైతే ఉన్నారో, ఎవరి సుఖం చలించటం లేదో, అదే నిజమైన సుఖం. ఆ సుఖసముద్రములో ఈదాలి మీరు, ఈ సబ్జెక్టు చెప్పటంలో ఇంకొక ప్రయోజనం లేదు.**

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్


(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# ప్రేమస్వరూపం శ్రీనాన్నగారు



శ్రీ నాన్నగారు మనని తరింపచేయటానికి ప్రేమస్వరూపుడిగా ఈ భూమి మీద 83 సంవత్సరాలు మనమధ్య ఉండి, అంతర్వాహినిగా ఆ ప్రేమను ప్రవహింప చేస్తూనే వున్నారు. ఆయనతో సాన్నిహిత్యం కలిగిన భక్తులలో హైదరాబాదు విజయ్ ఒకరు. చిన్నవయసు నుండి తమ తల్లిగారితో పాటు నాన్నగారిని దర్శిస్తూ, ఆయన సమక్షంలో గడుపుతూ, ఆయన అనుగ్రహానికి పాత్రుడైన విజయ్ తన మనోభావాలను మనతో పంచుకున్నారు.

సద్గురు శ్రీ నాన్నగారి గురించి ఒక్క వాక్యంలో చెప్పాలంటే - 'మన కన్నా మనలను ఎక్కువగా ప్రేమించేవారు' అని అనవచ్చు. ఈ సృష్టిలో ఎవరైనా ఎక్కువగా ప్రేమించేది దేనిని అంటే తనను తానే ప్రేమించుకుంటారు. కానీ మనకన్నా మనలను ఎక్కువగా ప్రేమించినవారు కేవలం శ్రీ నాన్నగారే.

ప్రేమించడం అంటే- మనకు ఏది మంచిదో అదే ఇవ్వడం మరియు మనకు హాని కలిగించేవాటిని దూరం చేయడం. మాట, చూపు, సాన్నిధ్యము, మందలింపు, పలకరింపు, మౌనం, తలపెట్టుకోవడం, స్పర్శ, ఉదాసీనత - ఏదైనా అవ్వనివ్వండి, వాటి వెనుక ఉద్దేశ్యం ఒక్కటే - మనం బాగుండాలని కాదు, కాదు బాగుండాలి కన్నా బాగుపడాలి అనడం సమంజసం. మనం బాగుపడటానికి ఆయన ఎంత దూరం వెళ్తారో అనేది మన ఊహాకు అందని విషయం. అందుకే దానిని ఒక్క పదములో వర్ణించాలి అంటే అది ఆయన 'అనుగ్రహము' అని అనవచ్చు. పాషాణం లాంటి హృదయాలను కరిగించడానికి ఆయన ఒక్క చిరు మందహాసం సరిపోతుంది.

దుఃఖ స్పర్శలేని స్థితిని, ఇప్పుడే, ఇక్కడే, ప్రతీ ఒక్కరూ, ఎటువంటి సాధనల పేరిట

కష్టపడకుండా, అనుభవించేయాలి అనేదే ఆయన తాపత్రయం. కష్ట పడకుండా పొందేయాలి అనుకోవడం సృష్టి విరుద్ధమే, అయినా ఆ ప్రయత్నం ఎప్పటికీ వదలలేదు. ఎందుకంటే తమ స్వరూపాన్ని ప్రేమించడం కన్నా మనలను ఎక్కువగా ప్రేమించారు గనుక. విధి విధానమును తప్పించుటకు ఎవరు సాహసించెదరు - అని అంటారు. కానీ శ్రీ నాన్నగారు తమ అనుగ్రహ భాషణాలను మన చేత ఆచరింప చేసి, అనుభవంలోకి తీసుకురావడానికి చేసిన ప్రయత్నం అటువంటి సాహసమే కదా.

సముద్రం అంతటి జ్ఞానాన్ని హృదయంలో పెట్టుకుని, ఒక సామాన్య మానవునిగా ప్రవర్తించడం రామునికే సాధ్యం అనుకుంటారేమో. కాని నాన్నగారు, అది మన అపోహ అని నిరూపించారు. ఒక వైష్ణవ భక్తుడు అమ్మవారితో 'అమ్మా నువ్వు మళ్ళీ ఏ అవతారం ధరించి వచ్చినా సీతమ్మ పడిన కష్టం పడలేవు' అని అన్నాడు. అలాగే మనమూ అందాము: ఓ నాన్నగారు! మీరు మళ్ళీ ఎటువంటి అవతారం ధరించి వచ్చినా సరే, నాన్నగారిలా మాత్రం అనుగ్రహించలేరు'. రామరావణ యుద్ధాన్ని పోల్చాలి అంటే రామ రావణ యుద్ధంతోటే పోల్చాలి. అలాగే శ్రీ నాన్నగారి అనుగ్రహాన్ని శ్రీ నాన్నగారి అనుగ్రహంతోనే పోల్చగలము.

బృందావనమది అందరిదీ, గోవిందుడు అందరి వాడేలే అని అంటారు. కాని అందరివాడిలా ఉండగలగడం ఎంత కష్టమండీ! ఎందుకంటే ఎవ్వరినీ నొప్పించకుండా ఉండగలగాలి. ఒకవేళ నొప్పించినా ఓదార్చగలగాలి. కాని ఎవ్వరినీ నొప్పించకుండా ఉండగలిగే నేర్పు, ఒకవేళ నొప్పించినా ఓదార్చగలిగే ఓర్పు శ్రీ నాన్నగారికి వెన్నతో పెట్టిన విద్య. జరాసంధుడిని ఎందుకు చంపనివ్వవు అని బలరాముడు కృష్ణుడిని అడిగితే కృష్ణుడు 'మనం దుష్టుల కోసం ఎక్కడని వెతుకుతాము? ఈ జరాసంధుడిని వదిలితే రేపు వాడు ఈ సృష్టి లోని మారుమూలన ఉన్న దుష్టులను అందరినీ వేసుకొని యుద్ధానికి వస్తాడు. అప్పుడు మన పని తేలిక అవుతుంది' అన్నాడు. దీనిని డివైన్ ఇంటలిజెన్స్ అని అంటారు. ఎదుటివారి తప్పు వేలెత్తి చూపడం శాస్త్రం కూడా చేయగలదు. కాని శ్రీ నాన్నగారిలా ఎదుటివారి మనస్సు నొప్పించకుండా, వారి దోషాలు ప్రేమతో వ్యక్తపరచగలగడం, వారిలో పెనుమార్పు తేగలగడం ఏ శాస్త్రాలకైనా, ఏ శాస్త్రవేత్తలకైనా సాధ్యమంటారా? అది మామూలు ఇంటలిజెన్స్ తో సాధ్యం కాదు, డివైన్ ఇంటలిజెన్స్ తోటే సాధ్యం.

మౌన భాష ఎరిగినవారు లోపలి సుఖము చవిచూస్తారు అని అంటారు. శ్రీ

నాన్నగారికి ప్రబోధించడం కన్నా ఆ మౌన భాష అంటే ఎక్కువ మక్కువ. కాని భక్తుల వత్తిడితో ఆఖరి వరకూ బోధించడం శ్రీ నాన్నగారికి తప్పలేదు. బోధించడం తమ ప్రారబ్ధం అని స్వీకరించారు. ప్రారబ్ధాన్ని ఇష్టంగా అనుభవించండి అనే భగవద్గీతా సారాన్ని చెప్పడమే కాదు, ఆచరించి మరీ చూపించారు శ్రీ నాన్నగారు.

స్వధర్మే నిధనం శ్రేయః అని కృష్ణ పరమాత్మ భగవద్గీతలో ప్రబోధించినట్లు, ఎవరు ఏ వృత్తిలో ఉన్నా వారు అది వదలకుండా కొనసాగిస్తూ కూడా తరించవచ్చు అని శ్రీ నాన్నగారు ఆధ్యాత్మికత పేరుతో ఎవరినీ కూడా తమ పనిని మాననిచ్చే వారు కాదు. పనిమానేస్తే మీకు జ్ఞానం రాదు, సోమరితనం వస్తుందని డ్యూటీ ఈజ్ గాడ్ అని భౌతిక జీవితానికి ఆధ్యాత్మిక జీవితానికి భేదం లేదు అని నొక్కి నొక్కి చెప్పారు శ్రీ నాన్నగారు. అప్పడే జన్మించిన తన నవ శిశువు గుండెల మీద తన్నుతూంటే తల్లి ఎలా హర్షిస్తుందో, శ్రద్ధగా తమ పని తాము చేసుకునే వారిని చూసి శ్రీ నాన్నగారు అలా హర్షించేవారు.

తెలివైన పిల్లలు సంవత్సరం పొడుగునా శ్రద్ధగా టెక్స్ట్ బుక్స్ చదువుతారు. కాని ఎక్కువ తెలివితేటలు లేని పిల్లలు సంవత్సరం చివరన నోట్స్ లేక మోడల్ పేపర్స్ చదివి పాస్ అవుతారు కదా. అలాగే శ్రీ నాన్నగారి ప్రబోధనలు అన్నీ కూడా మనవంటి మందబుద్ధులకు ఈ భవసాగరాన్ని దాటించే నోట్స్ లేక మోడల్ పేపర్స్ అని చెప్పవచ్చు. అక్షరమణమాలలో భగవాన్: 'ఓ అరుణాచలా! నువ్వు నాకు ఒక స్టైలిష్ హెయిర్ కట్ చేస్తావు అనుకుంటే గుండు చేసి పడేసావేమిటి?' అని అడిగినట్లు, మనం కూడా 'ఓ నాన్నగారు! మా అహంకారాలను సంతృప్తి పరుస్తారు అనుకొని మీ దగ్గరకు వస్తే మా అహంకారాన్నే మింగేస్తున్నారేమిటి?' అని అడగవచ్చేమో.

ఏమి చేసినా నరేంద్రుని సందేహబుద్ధిని పోగొట్టలేనప్పడు శ్రీ రామకృష్ణులు 'ఓ నరేన్! నా ప్రేమే గనుక నిజమైతే నీవు తరించి తీరుతావు' అన్నారు. అందుకే వాల్మీకి కూడా సీతమ్మతో 'సందేహింపకు రఘురాముని ప్రేమను సీతమ్మా' అని అంటాడు. మనము తరిస్తామా? అని సందేహించడం మనందరి పట్ల శ్రీ నాన్నగారి ప్రేమలోని నిజాయితీకి ఋజువులు అడగటం వంటిది. అందుకే షేక్స్పియర్ తిట్టినటువంటి బ్రూటస్ లము అయినా సరే, ఏసు తిట్టినటువంటి విశ్వాసహీనులమైనా సరే, సద్గురు శ్రీ నాన్నగారి కృపాపాత్రులం అయిన మనందరం తరించి తీరుతాము.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 12 మే 1995, మల్కిపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

**ఓం నమోనారాయణాయ ! ఓం నమోనారాయణాయ!**

మల్కిపురం భక్తుల ఆహ్వానాన్ని పురస్కరించుకుని ఈ మల్కిపురం గ్రామం రావడం జరిగింది. ఇక్కడ స్వామి వారి దర్శనం మీరు అందరూ చేసే ఉంటారు. చాలా సుందరమైన మూర్తి. సత్యం, శివం, సుందరం. సర్వ సాధారణంగా రూపానికి మనసుని ఆకర్షించే గుణం ఉంది. స్వామిని చూడగానే ఆయన మన మనసుని హరిస్తారు. అయితే మన స్వరూపాన్ని తెలుసుకోవడానికి మనకు అడ్డు వచ్చేది ఇతరులు కాదు, మన మనస్సే మనకు అడ్డు వస్తుంది. మన తలంపులే మనకు అడ్డు వస్తున్నాయి. మనకి శరీరం వచ్చింది అంటే కాలక్షేపానికి వచ్చింది అని ఎవరు అనుకోవద్దు. మన శరీరం ఈ భూమి మీద ఎటువంటి కర్మ అనుభవించవలసి ఉందో ఆ కర్మానుభవం కోసమే మనకు ఈ శరీరం వచ్చింది. ఈ శరీరంలో ఎటువంటి అనుభవాలు మనకి కలగాలో, ఆ అనుభవాలు అన్నీ కలిగిన తరువాత మన శరీరం మరణిస్తుంది. ఆ అనుభవాలు, ఆ మొట్టికాయలు అన్నీ తినేవరకు ఈ శరీరం ఉంటుంది. మొట్టికాయలు తినడం పూర్తి అయిపోయిన తరువాత శరీరం మరణిస్తుంది. అంటే ఏదో సరదాగా కాలక్షేపానికి వచ్చింది ఈ శరీరం అనుకోవద్దు. కర్మానుభవం కోసం వచ్చింది. కర్మ అనుభవించేస్తే మంచిదే. కర్మ అనుభవించడం వల్ల క్షీణిస్తుంది. అందుచేత అనుభవించేది ఇష్టంగా అనుభవించండి. మళ్ళీ వచ్చే జన్మలో ఇటువంటి కర్మ ఎదురవ్వదు ఇష్టంగా అనుభవిస్తే, ఇష్టం లేకుండా అనుభవిస్తే ఇదే ఎదురవుతుంది మళ్ళీ, ఇదే రహస్యం. మనం చేసే పనిని ఇష్టంగా చేస్తే, మనం అనుభవించే కర్మని ఇష్టంగా అనుభవిస్తే, వచ్చే జన్మలో ఇటువంటి కర్మ ఎదురవ్వదు. అందుచేత ఈ దేహం ఎందుకొచ్చింది అంటే కర్మానుభవం కోసం వచ్చింది. ఈ కర్మ అనుభవించడం వల్ల అది క్షీణిస్తుంది. తరువాత ఆ అనుభవం వల్ల జీవితంలో కొన్ని పాఠాలు కూడా నేర్చుకుంటాం.


కుటుంబం కర్మని బట్టి వస్తుంది. భారతదేశంలో అనేక కుటుంబాలు ఉన్నాయి, particularగా ఆ కుటుంబంలో, మల్కిపురంలో పుట్టడానికి కారణం ఏమిటి? కుటుంబం కర్మనిబట్టి వస్తుంది. తర్వాత సెక్స్ కూడా కర్మని బట్టి వస్తుంది. కొన్ని జీవులు చూడండి స్త్రీలుగా పుట్టారు, కొన్ని జీవులు పురుషులుగా పుట్టారు. అలా ఎందుకు పుట్టారు? అది కర్మని బట్టి వస్తుంది. మన శరీరానికి రంగు ఉంటుంది. నల్లగానో, తెల్లగానో, ఎర్రగానో ఉంటాము. మొత్తం మీద

ఏదో ఒక కలర్ ఉంటుంది కదా, కలర్ లేకుండా శరీరం ఉండదు. అది కూడా కర్మని బట్టే వస్తుంది. అందుచేత భగవాన్ చెబుతూ ఉండేవారు నీ దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టేసి నువ్వు వచ్చిన పని ఏదో చూసుకో అన్నారు. మనకి భగవంతుడు ఉన్నాడా, లేడా అన్నది సమస్య కాదు ఇక్కడ, దుఃఖం నివారణ అవ్వాలి. మనిషికి దుఃఖం వస్తుంది, ఆ దుఃఖానికి కారణం ఏమిటి? ఆ కారణాన్ని ఎలా తొలగించుకోవాలి? అనేది ముఖ్యం. మనిషికి దుఃఖం కోరిక లోంచి వస్తుంది. కోరిక ఎక్కడ నుంచి వస్తుంది అంటే, వాసనలోంచి వస్తుంది. భౌతిక హృదయం రక్తాన్ని పంపు చేస్తుంది దానిని physical heart అంటారు. అలాగే మన హృదయంలో spiritual heart అని ఒకటుంది. ఈ భౌతిక హృదయం ఎడమ పక్కన ఉంటుంది. ఈ spiritual heart కుడి పక్కన ఉంటుంది. అందులో కోరికలు, వాసనలు, ఈ tendencies, desires, పూర్వ జన్మల గొడవలు అన్నీ కూడా అక్కడ ఉంటాయి. అందుచేత మన ప్రవర్తన సక్రమంగా ఉంటే, మనకి మనో నిగ్రహం, ఇంద్రియ నిగ్రహం ఒక క్రమంగా ఉంటే, మన సత్కర్మ, ఆలోచన క్రమంగా ఉంటే, నిదానంగా ఉంటే మీరు భగవంతుడు ఉన్నాడని నమ్మినా, నమ్మకపోయినా మోక్షం వస్తుంది. మన పనేదో మనం చేసుకుంటూ సాధ్యమైనంత వరకూ ఇతరుల గొడవలలోకి కలుగజేసుకోకుండా, మీకు ఇష్టమైన రూపాన్ని ఉపాసన చేసుకుంటూ ఉంటే కూడా మనసు నశిస్తుంది. పరమేశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు. నేను అందరి హృదయాలలోనూ ఉన్నాను అని పరమేశ్వరుడు చెప్పాడు. అయితే మనకి అనుభవంలో లేదు ఆ విషయం. ఈశ్వరుడు ఉన్నాడు ఉండటం కాని ఆయన మనకి అనుభవంలో లేడు, సత్యవస్తువు మనకు అనుభవంలో లేదు కాబట్టి ఆ వస్తువే లేదు అనుకుంటున్నాం మనం, వస్తువు ఉంది. అయితే ఆ వస్తువు మనకి అనుభవంలోకి రావడానికి మన మనస్సు, మన అలవాట్లు, మన కోరికలే అడ్డు వస్తున్నాయి. గర్వం, ఆశ కొంచెం తగ్గించుకుంటే మనలో ఉన్న చైతన్యం మనకి తెలుస్తూనే ఉంటుంది. మనం బాహ్య గొడవలు అన్నీ చూసుకుని ఏదో ఒకగర్వం తెచ్చుకుంటూ ఉంటాం. ఇవేమీ నిలబడేవి కావు, ఇవన్నీ స్వప్న సమానమే. ఒకవేళ ఇవన్నీ ఉన్నా మన దేహం ఏదో ఒక రోజున జారిపోతుంది. అంటే ప్రపంచంలో ఉన్న వస్తు జాలాన్ని చూసి మనం గర్వం తెచ్చుకోకూడదు.

అంటే మన జీవయాత్రకి సరిపడా సామాగ్రి maintain చేసుకుంటూ, ఇతరుల మీద ఆధారపడకుండా మన పని ఏదో మనం చేసుకుంటూ, ఇతరులకి చేతనైనంత సహాయం చేసుకుంటూ, రాముడో, కృష్ణుడో, ఎవరో ఒక అవతారపురుషుడిని గాని, గురువుని కాని మనం ఆరాధిస్తూ ఆ నామాన్ని స్మరించుకుంటూ భక్తిమార్గం, జ్ఞానమార్గం, కర్మమార్గం, ధ్యానమార్గం ఈ మార్గాలన్నీ ఏదోపూర్వ జన్మ సంస్కారాలను బట్టి ఒక్కొక్కమార్గం ఒక్కొక్క

వ్యక్తికి ఇష్టం ఉంటుంది అంతే కానీ ఈ మార్గాలు అన్నీ ఒక మార్గానికి ఇంకొకమార్గం విరోధాలు ఏమీ కావు, ఈ నాలుగు మార్గాలని సమన్వయము చేసుకుంటూ ముందుకు వెళితే, మనకి వస్తువు తెలుస్తుంది. అంటే మనసు పలుచబడుతుంది, అది అంతర్ముఖం అవుతుంది, శిరస్సులో మనస్సు ఎంత సహజంగా ఉంటుందో, ఈ spiritual heartలో మనసు అంత సహజంగా ఉండి అది కరిగిపోతుంది. అయితే ఇక్కడ రమణమహర్షి గారు చెప్పేది ఏమిటంటే ఉపాసన వద్దు అని చెప్పటం లేదు. భక్తి వద్దు అని చెప్పటం లేదు. అన్నీ మంచివే అని చెబుతున్నారు. అన్నీ కూడా చిత్తశుద్ధి కలుగజేస్తాయి. చిత్తశుద్ధి లేకపోతే మనం మోక్షాన్ని పొందలేము.

మనస్సు నిర్మలంగా ఉండాలి. ఆవేశాలకి, ఉద్రేకాలకి దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు emotionకి గురి కాకూడదు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఉద్వేగానికి గురి కాకుండా మన పని ఏదో మనం చక్కగా చేసుకుంటూ వెళ్ళాలి. మన పని మనం క్రమంగా చేసుకోవడం వల్ల కూడా ఈశ్వరుడి యొక్క దయ మనకి కలుగుతుంది. అయితే ఇక్కడ రమణమహర్షి గారు ముఖ్యమైన విషయం ఏమని చెబుతున్నారు అంటే నీకు వెంటనే ఫలితం కావాలి అంటే అప్పుడే, అక్కడే నీకు ఫలితం కావాలి అంటే, నువ్వు నేను నేను అని అంటున్నావు కదా, ఆ నేనును నువ్వు ఎవరు అని అడుగు అంటున్నారు. ప్రతీ మనిషి నేను నేను అని అంటాడు. ఆ నేనుని నువ్వు ఎవరవు అని అడుగమంటున్నారు, నువ్వు ఎవరవు అని ఆ నేనుని ప్రశ్నించమంటున్నారు. నేను ఎవరు అనేది సమాధానం కాదు ప్రశ్న, దానికి సమాధానం ఆత్మజ్ఞానం. నేను ఎవరు అని ప్రశ్నిస్తే ఏమవుతుంది అంటే బాహ్యానికి విజృంభించడం మానేసి ఆ నేను అనేబుద్ధి అది ఎక్కడ నుంచి ఉదయిస్తుందో అక్కడకు మళ్లించబడుతుంది, అంటే వెనక్కి వెళుతుంది. అంటే దానిని ప్రశ్నించుకుంటూ వెనక్కి తోలుకు వెళితే దాని మూలంలోకి అది వెళ్ళిపోతుంది. దాని మూలంలోనే అంటే మన హృదయంలోనే పరమేశ్వరుడు ఉన్నాడు. నిజమైన దేవుడు ఎక్కడ ఉన్నాడు అంటే మన హృదయంలోనే ఉన్నాడు. ఈ నేను నిజమైన దేవుడి దగ్గరకి



**భగవంతుడికి సంబంధించిన కథలు వినాలి. ఆయనకి సంబంధించినటువంటి చరిత్రలు చదవాలి. మన అహంకారాన్ని మన మనస్సు ఒక పక్కన పెట్టేసి ఆయన చెప్పిన మాటలు మనం శ్రవణం చేయాలి. శ్రవణం చేయగా చేయగా ఆయన పట్ల మనకి భక్తి కలుగుతుంది. విశ్వాసం కలుగుతుంది. ఆ విశ్వాసమే ఆయన హృదయంలోకి మనల్ని తీసుకెళ్తుంది. ఆయనకి మనకి ఉన్న దూరాలు తగ్గిస్తుంది.**

వెళ్ళడానికి ఇష్టపడదు. వెళితే కరిగిపోతాము అని భయం దానికి, అంటే నేను ఎవరు అనే ప్రశ్న వేసుకోవడానికి ఎవరికీ ఇష్టం ఉండదు. చెబుతున్న నాకు ఇష్టం ఉండదు, వింటున్న మీకు ఇష్టం ఉండదు. ఏదో ఒక బొమ్మని ఆరాధించటమంటే మనం తేలికగా ఆరాధిస్తాం కానీ ఏదైతే నేను నేను అని అంటుందో ఆ నేనుని ఎవరు అని ప్రశ్నించడం మనకి ఇష్టం ఉండదు. ఇష్టం ఉండక పోవడానికి కారణం ఏమిటి అంటే మనం ఉండకుండా పోతామేమో అని భయం. మనం ఉండకుండా పోవడం మనకి ఇష్టమేనా? మనకి ఉండాలని ఉంది కానీ పోవాలని ఉందా? ఉండాలనే ఉంది. అందుచేత ఆ నేనుని నువ్వు ఎవరు ఎవరు అని ప్రశ్నించుకుంటుంటే ఏమవుతుంది అసలు మనమే లేకుండా పోతే, దేవుడు ఎందుకు, ప్రపంచం ఎందుకు, భక్తి ఎందుకు, అని భయం వాడికి. అందుచేత ఏదో నటిస్తున్నారు కానీ దానిని విచారణ చెయ్యడానికి ఎవరూ సిద్ధపడటం లేదు. అందుకే రమణమహర్షి గారు ఏమన్నారు అంటే అందరూ గజ ఈతగాళ్ళే కాని ఎవరూ గజం కదలడం లేదన్నారు. అంటే దేవుడిని ఆరాధించమంటే ఆరాధిస్తాం కానీ నేనుని పోగొట్టుకోవటానికి మనం ఇష్టపడం.

రామకృష్ణ పరమహంస గారిని కొంతమంది పిచ్చివాడి కింద చూసేవారు. ఆయన అనేవారు మీరు పిచ్చివాళ్ళే, నేను పిచ్చివాడినే, మీరు లోకానికి సంబంధించిన విషయాల పిచ్చిలో మీరున్నారు, దేవుడికి సంబంధించిన పిచ్చిలో నేనున్నాను అందుచేత మనందరం పిచ్చివాళ్ళమే అన్నారు. ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క పిచ్చి. భగవాన్ చెబుతూ ఉండేవారు ఈ మిథ్యానేనుకి, దేహగతమైన నేనుకి, ప్రపంచం ఒకటి సరిపోలేదు, శవం ఒకటి సరిపోలేదు దేవుడు కూడా ఒకడు కావలసి వచ్చాడు. దేవుడు ఉన్నాడో, లేడో మనకి తెలియదు. కానీ ఈ నేను అనే తలంపు అందరికీ ఉంది. నేను అనేబుద్ధి లేని మనిషి లేడు. నేను అనేబుద్ధి అందరికీ ఉంది. ఈ నేను అనేబుద్ధి ఎక్కడ నుంచి వస్తుంది? బయట నుంచి రావడం లేదు, లోపల నుంచే వస్తుంది. ఆ నేను అనేబుద్ధి ఎక్కడ నుంచి అయితే ఉదయిస్తోందో, ఆ ఉదయించిన చోటే ఈశ్వరుడు ఉన్నాడు. మనల్ని నియమించేవాడు మనకి దూరాన లేడు మన హృదయంలోంచే మనలని నియమిస్తున్నాడు. అయితే మన హృదయంలో పరమేశ్వరుడు ఉన్నప్పటికీ మనకి ఉన్న ప్రకృతి వాంఛల వల్ల, అలవాట్ల యొక్క వేగం వల్ల, మనకున్న ఇష్టాలు, అయిష్టాలు రాగ ద్వేషాలు యొక్క ప్రకోపం వల్ల వస్తువు మనకి వ్యక్తం కావడం లేదు. దానికి గురువు అనుగ్రహం, ఈశ్వర అనుగ్రహం అవసరం. మనం దేవుడిని పని ద్వారా కూడా ఆరాధన చెయ్యాలి. మనం గుళ్ళోకి వెళుతున్నాం అక్కడ ఒక మూర్తి ఉంటారు. ఎవరో శంకరుడో, రాముడో, కృష్ణుడో, వేంకటేశ్వరుడో ఏదో ఒక మూర్తి ఉంటాడు. ఎవరు ఏ రూపాన్ని, ఎవరు ఏ నామాన్ని పట్టుకుని ఆరాధించినా వాడు నన్నే

చేరుకుంటారు అని కృష్ణుడు చెప్పాడు. నన్నే చేరుకుంటారు అంటే ఆయన స్వరూపంలో చేరుకుంటారు. ఆయన స్వరూపం ఏమిటి? బ్రహ్మం. కృష్ణుడు ఇప్పుడు లేడు అని కాదు అంటే మనం ఎలా చనిపోతామో అలాగే కృష్ణుడు కూడా చనిపోయాడు అని మనం అనుకుంటాం. అంటే మనకి చచ్చిపోవటం అలవాటు కదా, అలాగే కృష్ణుడు కూడా చచ్చిపోయాడు అని, భగవంతుడు చచ్చిపోతాడా? భగవంతుడు ఏమి చచ్చిపోడు. అంటే భగవంతుడి దేహం ఇక్కడ లేనంత మాత్రాన భగవంతుడు లేడు అని కాదు. భగవంతుడు ఈ లోకాన్ని విడిచి పెట్టి ఎక్కడకి పారిపోడు.

మనం రూపాన్ని, నామాన్ని, గుణాన్ని తీసేసి ఒక పక్కన పెడితే వస్తువు మనకి వ్యక్తం అవుతుంది. మనం వాళ్ళు మంచివాళ్ళు, వీళ్ళు చెడ్డవాళ్ళు, వాళ్ళు చెడ్డవాళ్ళు అంటే ఎక్కడుంది ఆ మంచి, చెడ్డ? చైతన్యంలో మంచి, చెడ్డ లేదు మనసులో ఉంది. గుణాలు ఎక్కడ ఉన్నాయి? మన శరీరంలో రక్తం, మాంసం, ఎముకలు ఎలా ఉన్నాయో మనసులో గుణాలు ఉన్నాయి. మంచి గుణాలు ఉంటే మంచివాడు అంటాం, చెడ్డ గుణాలు ఉంటే చెడ్డవాడుఅంటాం. ఇవన్నీ ఎక్కడ ఉన్నాయి? మనసులోనే ఉన్నాయి అందుచేత మనం లోకాన్ని చూసేటప్పుడు, రూపాన్ని, నామాన్ని, గుణాన్ని పక్కకు పెట్టి చూస్తే అందరూ ఈశ్వరుడు స్వరూపంగానే కనిపిస్తారు. ఈశ్వరుడు లేకుండా అసలు దేహం రానేరాదు. కానీ మనకి ఈశ్వరుడి దృష్టి లేదు. మనుషులని చూస్తున్నాం, రంగులని చూస్తున్నాం, రూపాలని చూస్తున్నాం, నామాలని చూస్తున్నాం, గుణాలను చూస్తున్నాం. వారు మంచివారని, వీరు చెడ్డవారని, వారు నల్లగా ఉన్నారని, వీరు తెల్లగా ఉన్నారని, వారు స్త్రీలని, వీరు పురుషులని ఇలా చూస్తున్నాం. ఒకటి రూపం, రెండు నామం, మూడు గుణం ఆ మూడింటినీ తీసేయండి అందరూ ఈశ్వర స్వరూపంగానే మనకి కనిపిస్తారు. మనకి ఉన్న బేధబుద్ధి నశిస్తుంది.

ఒక విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. ఉన్నది ఒక్కటే వస్తువు. ఉన్న బ్రహ్మ పదార్థం ఒక్కటే. అది మన హృదయంలోనే ఉంది. దానిని తెలుసుకునే వరకు మనం శవాలను మోయవలసిందే. ఏ శవంలో ఉన్నప్పుడు ఆ శవాన్నే అలంకరించుకుంటూ ఉంటాం. ఇలా శవాలని మోస్తూనే ఉండాలి వస్తువు మనకి తెలిసే వరకు. శరీరం ఉండగానే అంటే ఈ ముక్కులో గాలి తిరుగుతున్నప్పడే మన హృదయంలో ఉన్న బ్రహ్మ పదార్థం కనుక మనకి అనుభవంలోకి వస్తే, ఇప్పుడు మన ఇంద్రియాలు, మన దేహం, మన మనస్సు ఏ విధంగా అయితే మనకి అనుభవంలో ఉందో అలాగే మన శరీరం మరణించక ముందే ఆ బ్రహ్మ పదార్థం కనుక మనకి అనుభవంలోకి వస్తే శరీరం పడిపోయినా ఫరవాలేదు ఆ స్థితి కంటిన్యూ అయిపోతుంది. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. దేహం చనిపోతుంది కాని మన

హృదయం లోపల చావు లేని వస్తువు ఒకటి ఉంది. ఆ చావులేని వస్తువుని దేహం ఉండగా ఎవడైతే తెలుసుకున్నాడో వాడి దేహం దేవాలయం అయిపోతుంది. మన హృదయంలో చావు లేని వస్తువుని మనం తెలుసుకుంటే అది చావుని చంపేస్తుంది. అంటే శరీరం చనిపోతున్నా నేను చనిపోవటం లేదు అనే అనుభవం వాడికి వచ్చేస్తుంది. దేహం పోయినా నేను ఉంటాను అన్న సంగతి ఊరికే కబుర్లు కాకరకాయలు తోటి కాకుండా శాస్త్ర జ్ఞానం తోటి సంబంధం లేకుండానే వాడికి స్పష్టంగా, ప్రత్యక్షంగా అనుభవంలోకి వస్తుంది, అయితే ఆ అనుభవం అనేది దేహం ఉండగా పొందాలి మనం, దేహం ఉండగా వాడు బ్రహ్మానుభవం పొందలేడు అనుకోండి అప్పుడు ఇంక ఈ రావటాలు, పోవటాలు, మన కర్మని బట్టి ఏదో ఒక కుటుంబంలో జన్మించడం. తరువాత చుట్టాలు, స్నేహితులు, ఈ పరిసరాలు, ఈ రోగాలు, ఈ కుటుంబాలు ఇవన్నీ కూడా కర్మని బట్టి సిద్ధం అవుతాయి, మీకు అర్థం అవుతోందా? కర్మని బట్టి శరీరం వస్తుంది. మళ్లీ వాడు స్వార్థం తోటి పని చేస్తూ ఉంటాడు. మళ్లీ కొత్త వాసనలు పోగు చేసుకుంటూ ఉంటాడు. అలా జన్మిస్తూ ఉంటాడు. అయితే ఏ అవతార పురుషుడు అనుగ్రహం వల్లో, ఏ మహా గురువు అనుగ్రహం వల్లో వాడు ఒడ్డుకు రావాలి కానీ ఈ జనన మరణ ప్రవాహం లోంచి లేకపోతే ఒడ్డుకి వచ్చే అవకాశం లేదు.

మనకి ప్రతీ మనిషికి సుఖం కావాలి. నాస్తికుడికి కూడా సుఖం కావాలి. దేవుడు అక్కర్లేదు అని చెప్పేవాడికి కూడా సుఖం కావాలి, శాంతి కావాలి. మీరు ఒకటి గుర్తు పెట్టుకోండి, మీకేదైనా అధికారం వచ్చింది అనుకోండి, డబ్బు వచ్చింది అనుకోండి భోగం వస్తుంది కానీ శాంతి రాదు. అధికారం ఉంటే, డబ్బు ఉంటే భోగం అనుభవించవచ్చు కానీ శాంతి కావాలి అంటే, సుఖం కావాలి అంటే జ్ఞానం కావాలి. జ్ఞానం వల్ల శాంతి అనుభవించవచ్చు. జ్ఞానం వల్ల సుఖం అనుభవించవచ్చు. మనం ఏ పని చేస్తున్నప్పటికీ భగవంతుడిని ఆరాధిస్తున్నట్టే మనం చెయ్యాలి. ఒక మొక్క వేసి పెంచుతున్నాం అనుకోండి మన ఇంట్లో, అది కూడా భగవంతుడిని ఆరాధిస్తున్నట్టే, భగవత్ స్వరూపంగానే చూడాలి. ప్రతీ వస్తువుని కూడా ఎలా చూడాలి? భగవంతుడి యొక్క స్వరూపంగానే మనం చూడాలి. గుళ్లో దేవుడిని ఎలా చూస్తున్నామో లోకం అంతా కూడా దేవుడిని చూడడం మనం నేర్చుకోవాలి. లోకం దేవుడు లేకుండా లేదు. అందుచేత లోకం అంతా కూడా పరమేశ్వరుడిని చూడడం మనం నేర్చుకుంటే మనకి రాగ ద్వేషాలు తగ్గుతాయి, ఉద్రేకాలు తగ్గుతాయి, సమానబుద్ధి కలుగుతుంది. అంటే రాగ ద్వేషాలు లేకుండా పని చేస్తే మనకి యోగం కూడా సిద్ధిస్తుంది. దేవుడి పేరేమిటి రాముడు, కృష్ణుడు, శంకరుడు, నారాయణుడు, దక్షిణామూర్తి ఈ పేర్ల కంటే మొట్టమొదటి పేరు ఏమిటి "I am" నేను ఉన్నాను. దేవుడి పేరు

ఏమిటి మొట్ట మొదటి పేరు "I am" నేను ఉన్నాను. మన అందరికీ ఉండాలనే ఉంది. అదీ దేవుడి పేరు. మన దేహం ఉన్నా, లేకపోయినా మన హృదయంలో వస్తువు ఎప్పుడూ ఉంటుంది. దేవుడి పేరు ఏమిటి అంటే ఉండటమే. దేవుడి మొట్టమొదటి పేరు ఏమిటి? అది ఉండటమే. ఆశ్చర్యం ఏమిటి అంటే దేహానికి చావు వస్తుంది అంటే భయం వేస్తుంది మనకి, చనిపోతున్నాం అంటే భయం వేస్తుంది. భయానికి కారణం ఏమిటి అంటే మన దేహం చనిపోయిన తరువాత మనం ఉండమేమో అని భయం, కానీ ఉంటాం. అంటే చనిపోయిన తరువాత దేహం కనపడదు, లోకం కనపడదు అని భయం మనకి, భగవాన్ చెప్పారు మీకు గాఢనిద్రలో కూడా దేహం కనపడడం లేదు, లోకం కనపడడం లేదు. మరి అప్పుడు ఎందుకు నీకు భయం వేయడం లేదు? అన్నారు. అంటే అది ఒక తలంపు. రేపు ఉదయం లేచి మాములుగా మన పనులు మనం చేసుకుంటాం కదా అని తలంపు ఉంటుంది మనకి, ఆ తలంపు వల్ల భయం కలగడం లేదు. మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందలేక పోవడానికి గల పెద్ద కారణాల్లో భయం ఒకటి.

ఈ మధ్యన ఒక తండ్రి గారు వాళ్ల అబ్బాయిని ఏదో పని ఉండి సాయంత్రం ఏడు గంటలకో, ఎనిమిది గంటలకో, పొలం వెళ్లి రమ్మన్నారు. నాకు భయం వేస్తుంది అన్నాడు. ఆ తండ్రి "భయం ఎలా ఉంటుందో ఒకసారి నా దగ్గరకి తీసుకురా. నీకు వంద రూపాయలు ఇస్తాను" అన్నారు. అదొక వికారం. ఇవి నిజాలు కాదు, భయం ఒకటి, రాగం ఒకటి, ద్వేషం ఒకటి, ఇవన్నీ వికారాలు. ఇవన్నీ వాస్తవం కాదు అవి. రాగ ద్వేషాలు కూడా అంతే, ఇష్టాయిష్టాలు కూడా అంతే, కామ క్రోధాలు కూడా అంతే, కామం కూడా తలంపు వచ్చాక వస్తుంది. క్రోధం కూడా నీకు తలంపు వచ్చాక వస్తుంది. నీకు తలంపులు లేకపోతే అవి లేవు. గాఢనిద్రలో ఈ గొడవలు ఏమీ లేవు కదా మనకి, దేహం లోంచి విడిపోతున్నాం, మనసు లోంచి విడిపోతున్నాం, లోకం లోంచి విడిపోతున్నాం. గాఢనిద్రలో వాడు bodyless, mindless, worldless. కానీ వాడు ఉన్నాడు. కానీ వాడు దేహం లేకుండా ఉన్నాడు. మనసు లేకుండా ఉన్నాడు. ప్రపంచం లేకుండా కూడా ఉన్నాడు. మనిషే కనుక దేహం అయితే మనిషే కనుక మనస్సు అయితే గాఢనిద్రలో కూడా వాడు దేహం లోంచి, మనసు లోంచి వాడు విడిపోవడానికి అవకాశం



**మన తెలివితేటల వల్ల, మన ప్రయత్నం వల్ల భక్తి కలిగిందేమో అని మనం అనుకుంటాము. ఆయనతో జన్మాంతర అనుబంధం వల్ల ఆయన అనుగ్రహమే మనల్ని స్మరించేటట్లు చేస్తుంది.**

లేదు. కానీ మనం ఈ దేహం లోంచి విడిపోతున్నాం. దేహాన్ని విడిచి పెట్టడం ఎవరికీ ఇష్టం లేదు కానీ దేహం మనలని విడిచి పెట్టేస్తుంది. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఎందుకు విడిచి పెట్టేస్తుంది? అది మనం కాదు కాబట్టి. మనస్సు కూడా అంతే, గుణాలు కూడా అంతే. ఈ మనస్సు కూడా మనలని విడిచి పెట్టేస్తుంది. ఎందుచేత విడిచి పెట్టేస్తుంది? అది మనం కాదు కాబట్టి. గాఢనిద్రలో మనకి మనస్సు గొడవ ఏమీ ఉండదు. ఎందుచేత? అక్కడ మనస్సు తోటి వేరు పడిపోతున్నాం, దేహం తోటి వేరు పడిపోతున్నాం, ప్రపంచం తోటి వేరు పడిపోతున్నాం. ఎందుచేత? మనం కాదు కాబట్టి వాటి తోటి వేరు పడిపోతున్నాం. ఇప్పుడు మనం అందరం దేహమే నేను అనుకుంటున్నాం కదా, దేహమే కనుక నేను అయితే దేహం లోంచి విడివడే అవకాశం లేదు మనకి, మనం ఏదైతే కాదో మనకి ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా విడిపోవటం తప్పదు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఈ దేహాన్ని విడిచి పెట్టడం మనకి ఇష్టం లేకపోయినా విడిపోతున్నాం కదా, మనం కాదు కాబట్టి.

మనం గ్రహించవలసినది ఏమిటి అంటే బ్రహ్మం, చావులేని వస్తువు, నిత్య వస్తువు, సత్య వస్తువు అది మీ హృదయంలో స్వయంగా ప్రకాశిస్తోంది. దాని గురించి శ్రవణం చెయ్యండి, మననం చెయ్యండి. మీరు జాగ్రత్తగా ఇక్కడ విన్న విషయాన్ని ఇంటికెళ్ళి మననం చేసుకుంటే, ఆ విషయం మీకు సొంతం అవుతుంది. ఇంటికి వెళ్ళిన తరువాత మననం చేసుకోకుండా ఇక్కడ విడిచి పెట్టేస్తే ఆ వస్తువు మటుకి మీకు సొంతం అవ్వదు. అంటే శ్రవణం చెయ్యగా, చెయ్యగా దానిని పొందాలి అనే ప్రీతి మీకు కలుగుతుంది. ఒక్కటే మీరు జ్ఞాపకం పెట్టుకోండి. అసలు ఆ వస్తువు ఇక్కడ ఉన్నప్పటికీ దానిని తెలుసుకోవాలి అనే కాంక్ష కూడా మనకి కలగడం లేదంటే దానికి మనలో ఉన్న పాపం కారణం. మన హృదయంలో ఒక వస్తువు ఉన్నప్పటికీ, పరమేశ్వరుడు హృదయంలో ఉన్నప్పటికీ, వాడిని తెలుసుకోవాలి అనేబుద్ధి కూడా మనకి కలగడం లేదు అంటే మనలో ఉన్న దోషాలు, మనలో ఉన్న పాపాలు, మనలో ఉన్న బలహీనతలే కారణం. మన ఆలోచనలో పొరపాటు ఉంది. అసలు తెలుసుకోవాలనే కాంక్ష బలీయంగా హృదయం లోంచి వస్తుంటే వాడికి ఈశ్వరానుగ్రహం ఉన్నట్టే గుర్తు. ఆ కాంక్ష కనుక వస్తే, ఈశ్వరుడి యందు ప్రేమ, ప్రీతి కనుక మనకి కలిగితే, ఈశ్వరుడిని కనుక మనం ఆరాధిస్తుంటే, ఈశ్వరుడిని జపిస్తుంటే, ఈశ్వరుడికి ఇష్టమైన పని మనం చేస్తూ ఉంటే, అప్పుడు ఆయన దయకి మనం పాత్రులం అవుతాం. ఆయన దయకి పాత్రులం అవ్వడం వల్ల ఆయనని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ఏ విషయాలైతే, ఏ సంస్కారలైతే మనలో అడ్డుగా ఉన్నాయో, వాటిని బయటకి తీసి మంట పెడతాడు పరమేశ్వరుడు. కేవలం మన తెలివి తేటలు సరిపోవు ఆయన అనుగ్రహం వల్లే జరగాలి. అందుచేత నువ్వు దాని గురించి శ్రవణం చెయ్యి. ఏ వస్తువును అయితే

తెలుసుకోవాలి అనుకుంటున్నావో ఆ వస్తువు గురించి శ్రవణం చెయ్యి. దాని గురించి ధ్యానం చెయ్యి. అంటే ఒకే వస్తువు మీద మనసు నిలబెట్టి చింతించడం వల్ల మనస్సు నశిస్తుంది.

వర్షాలు లేకపోతే చెట్లు ఎలా ఎండిపోతాయో, అలాగే ఎవడైతే ధ్యానం చెయ్యడో, ఎవడైతే విచారణ చెయ్యడో, వాడు ఎండిపోయిన చెట్లలాగా తయారవుతాడు అన్నారు. అంటే ధ్యానం అవసరం, విచారణ అవసరం. ధ్యానం వల్ల ఏమవుతుంది అంటే మనస్సు నిర్మలం అవుతుంది, ఆలోచనా శక్తి పెరుగుతుంది, విషయ గ్రహణ శక్తి పెరుగుతుంది. మీకు అర్థం అవుతుందా? ప్రపంచంలో ఒక కామన్ మాన్‌ని తీసుకోండి, తరువాత ఏ సైన్సులోనో, మెటాఫిజిక్స్‌లోనో, ఏదైనా ఒక బ్రాంచిలో చాలా ఉన్నతుడైన వాడిని తీసుకోండి. వాడికి, వీడికి తేడా ఏమిటి అంటే వీడిలో ఉన్న ఏకాగ్రత కామన్‌మేన్‌లో ఉండదు. ఒక మనిషి అభివృద్ధిలోకి రావాలి అంటే రెండు అవసరం ఒకటి ఏకాగ్రత, రెండు పవిత్రత. ఇవి రెండు కనుక ఉంటే మనిషి భౌతిక జీవితంలో కూడా అభివృద్ధిలోకి వస్తాడు. ఏకాగ్రత వల్ల అన్ని విషయాలు కూడా మనం సాధించవచ్చు. అంటే ఆ ఏకాగ్రత ఎప్పుడైతే మనకి కుదిరిందో, పవిత్రత ఎప్పుడైతే మనకి వచ్చిందో, చేతిలో డబ్బుంటే వస్తువులు కొనుక్కోవడం ఎంత తేలికో, ఏకాగ్రత, పవిత్రత మనకి వస్తే వస్తువుని తెలుసుకోవడం కూడా అంత తేలిక. అంటే ఇక్కడ పరమేశ్వరుడి లీల ఒకటి ఉంది. అంటే నీ హృదయంలో ఏ వాసనలు అయితే ఉన్నాయో, ఏ సంస్కారాలు అయితే ఉన్నాయో, అవి మీకు తెలియకుండా బయటకి తియ్యడానికి ఆయనకి కూడా అవకాశం లేదు. అందుచేత మీకు తెలిసేటట్టు చేసి బయటకు లాగుతాడు. ఈ సంస్కారం మీకు ఉంది సుమా అని మీ మెదడుకి చూపించి, అప్పుడు బయటకి తీసి మంట పెడతాడు. మనం శాస్త్రాన్ని విడిచి పెట్టకూడదు, భగవంతుడిని విడిచి పెట్టకూడదు. ఏ పని అయితే మనలని చెయ్యమని శాస్త్రం చెప్పిందో దానిని చేస్తూ, ఏది పనికిరాదు అనిచెప్పిందో దానిని విడిచి పెట్టాలి. కుతంత్రాల వల్ల, కుయుక్తుల వల్ల జ్ఞానం కలగదు. ఎవడైతే పవిత్రం అయినటువంటి మానసం కలవాడో వాడికి జ్ఞానం కలుగుతుంది కానీ, కుయుక్తుల వల్ల, కుతంత్రం వల్ల మటుకి జ్ఞానం కలగదు. సహృదయం ఉన్నవాడు సద్బుద్ధి ఉన్నవాడే జ్ఞానానికి యోగ్యుడు అవుతాడు.

గురువు యొక్క అనుగ్రహం చాలా ముఖ్యం. ఒక్కసారి గురువు అనుగ్రహంలో పడ్డాడు అంటే వాడు ఏజన్మలో ఉన్నప్పటికీ వాడు ఎక్కడ ఉన్నాడో చూసుకుంటూ వాడు తరించే వరకు, వాడికి బ్రహ్మానుభవం కలిగే వరకు ఆ గురువు వాడిని విడిచి పెట్టడు అని చెప్పారు భగవాన్, వాడికి ఒక్కసారి గురువు అనుగ్రహం కలిగింది అనుకోండి వాడి పని పూర్తి అయిపోయినట్టే అన్నారు. మనకి ఎవరి మీద అయినా ప్రేమ ఉంది అనుకోండి

వాళ్ళు బాగుపడితే మనం సంతోషిస్తాం. అంతేకదా, గురువు కూడా ఆయన స్వరూపం మనకి ఇచ్చేవరకు మనలను విడిచిపెట్టడు, ఆయన మన హృదయంలో ఉన్నాడు. గురువు అన్నా, ఆత్మ అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే. ఉన్న వస్తువునే మనం గురువు అంటున్నాం, ఈశ్వరుడు అంటున్నాం, ఆత్మ అంటున్నాం. వాడు ఎక్కడ ఉన్నాడు? హృదయంలోనే ఉన్నాడు. జీవుడు ఎప్పుడైతే కొంచెం అంతర్ముఖుడు అయ్యాడో, హృదయాభిముఖంగా ఎప్పుడైతే ప్రయాణం చేశాడో, ఒక్కసారి ఆయన చేతికి ఎప్పుడైతే జీవుడు అందాడో వాడిని హృదయంలోకి లాక్కొని ఈ జీవుడిని కరగబెడతాడు. జీవుడు కరిగిపోవటం వల్ల ఏమవుతుంది అంటే మనం ఉండకపోవటం కాదు, మనం ఎవరో మనకి తెలుస్తుంది. మనస్సు నశించటం వల్ల మనం లేకుండా పోము, కానీ మనం ఎవరమో మనకి తెలుస్తుంది.

ఒక కులం తోటి కానీ, ఒక జాతి తోటి కానీ, ఒక దేశం తోటి కానీ తాదాత్మ్యం ఎప్పుడు పొందుతున్నావు అంటే నీకు తలంపు వచ్చాక పొందుతున్నావు. మేము భారతీయులం అని, మేము అమెరికన్స్ అని, మేము రాజులం అని, మేము వైశ్యులం అని, ఇదంతా కూడా నీకు తలంపులు వచ్చాకే ఈ హద్దులు వస్తున్నాయి కానీ, తలంపులు లేనప్పుడు నీకు హద్దులు లేవు, అంచులు లేవు. మనల్ని బంధించేవి మన తలంపులు. ఇతరులు ఎవరు మనలని బంధించడం లేదు. మన తలంపులే మనల్ని బంధిస్తున్నాయి. కామం కింద, ద్వేషం కింద, రాగం కింద, క్రోధం కింద ఈ తలంపులే మనకి వస్తున్నాయి. తలంపులు ఎవడికి వస్తున్నాయి? నేనుకి వస్తున్నాయి. ఈ నేను అనేది మొదటి తలంపు. మనం నేను నేను అంటున్నాం. భగవాన్ ఏమని చెప్పారు అంటే ఏదైతే మీరు నేను నేను అంటున్నారో, ఆ నేను నిజం అనుకోండి, ఆ నేనే సత్యం అనుకోండి, ఇంక ఈ బోధ అక్కర్లేదు, ఈ విచారణ అక్కర్లేదు. నేను ఎవరిని అనే ప్రశ్న అక్కర్లేదు అంటున్నారు. నిజం కాని దానిని మీరు నిజం అనుకుంటున్నారు కాబట్టి ఈ ప్రశ్న వెయ్యవలసి వచ్చింది. నిజాన్ని నిజం అనుకుంటే ఇబ్బంది ఏమీ లేదు. సత్యాన్ని సత్యం అనుకుంటే ఇబ్బంది ఏమీ లేదు. నువ్వు అసత్యాన్ని సత్యం అనుకుంటున్నావు కాబట్టి అందులోంచి నిన్ను విడుదల చెయ్యడం కోసం నేను ఎవరను అనే ప్రశ్న వచ్చింది.

మోక్షం అంటే విడుదల. ఎందులోంచి విడుదల? అజ్ఞానమనే జైలు, అహంకారమనే జైలు, దేహబుద్ధి అనే జైలు నుండి విడుదల మోక్ష శాంతి ఎలా ఉంటుందో, ఆ మోక్ష సుఖం ఎలా ఉంటుందో, జీవితంలో కొన్ని క్షణాలైన మన శరీరం శవం అవ్వకముందే కొన్ని క్షణాలైనా మనం కనుక అది అనుభవిస్తే, తప్పనిసరిగా మన మనస్సు అంతర్ముఖం అవుతుంది. దానంతట అదే లోపలకి వెళుతుంది. డాక్టరు గారి దగ్గరకి మనం వెళతాం అనుకోండి

మందిచ్చి ఇది పదేళ్ళ తరువాత పని చేస్తుంది అని డాక్టరు గారు అంటే మనం ఏమనుకుంటాం? భగవాన్ చెప్పేది అలా కాదు శరీరం అనంతరం ఏ జన్మ వస్తుంది ఆ గొడవ ఆయన చెప్పరు, ఇప్పుడే ఇక్కడే మల్కిపురంలోనే అది తేలిపోవాలి అంటారు. బంధం అంటే ఏమిటో, మోక్షం అంటే ఏమిటో మీకు తెలియదు. కాని ఈ నేను అనేది ఒకటి ఉందని మీకు తెలుస్తోంది కదా, ఆ నేను మీకు అనుభవంలో ఉంది కదా, దాన్ని విచారణ చేస్తే ఇప్పుడే మీకు అనుభవం వచ్చేస్తుంది. ఇప్పుడే జ్ఞానం వచ్చేస్తుంది. ఇప్పుడే, ఇక్కడే, ఎప్పుడో, ఎక్కడో కాదు ఇప్పుడే, ఇక్కడే మీకు వస్తువు దొరుకుతుంది అంటున్నారు.

ఈ నేనులోనే ఉంది రహస్యం అంతా. నేను అనేది ఒక తలంపు. జాగ్రదావస్థలోకి వచ్చాక ఈ నేను గొడవ వస్తుంది. గాఢనిద్రలో మీకు ఈ నేను గొడవ ఏమీ లేదు. అంటే గాఢనిద్రలో మీకు తలంపులు లేవు. ఈ నేను కూడా ఒక తలంపు కాబట్టి ఈ నేను అక్కడ మిమ్మల్ని విడిచి పెట్టేస్తుంది అది మీరు బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఏ తలంపు వచ్చినా మీరు కంగారు పడకండి, హెచ్చుతగ్గులు ఏమి వచ్చినా కంగారు పడకండి, రాగ ద్వేషాలు వచ్చినా కంగారు పడకండి, వెయ్యి గొడవలు ఉండనివ్వండి, ఎన్ని వచ్చినా ఏమీ ఇబ్బంది లేదు. ఇవన్నీ ఎవరికీ వస్తున్నాయి అని ప్రశ్నించుకోమన్నారు. ఈ ఆలోచనలు అన్నీ ఎవరికి వస్తున్నాయి? ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి? అని ప్రశ్నించుకోమన్నారు. ఈ బుజ్జి గాడికే వస్తున్నాయి. ఏ బుజ్జిగాడికి? దేహగతమైన నేనుకే వస్తున్నాయి. మొత్తం ఎన్ని గొడవలు వచ్చినా, తొంభై గొడవలు వచ్చినా మీకు సంసారంలో కంగారు పడకండి. ఇవన్నీ మాయ గొడవలు. ఈ గొడవలు అన్నీ ఏ నేనుకి వస్తున్నాయో, ఆ నేనుని విచారణలో పెట్టండి. ఆ నేనుని విచారణలో పెట్టడానికి మీరు సిద్ధంగా లేరు. చచ్చిపోయిన తరువాత ఈ నేనుని కైలాసం లోకో, వైకుంఠం లోకో, స్వర్గ లోకం లోకో, ఎక్కడికో తీసుకువెళ్దాం అని మీరు చూస్తున్నారు కానీ దీనిని విచారణలో పెట్టడానికి మీకు ఇష్టం లేదు. ఏవండీ ఎక్కడికి తీసుకువెళ్ళినా వాడు మళ్ళీ భూమి మీదకి రావాల్సిందే. అందుచేత ఈ నేనుని ఎక్కడికో తీసుకువెళ్ళడం కాదు వాడి గురించి మీరు విచారణ చెయ్యండి. వాడు నిజం కాదు, నిజం వలె మీకు కనిపిస్తున్నాడు.



**కోరికతోటి ఏదైనా పని చేసినప్పుడు మనస్సు మనకు తెలియకుండా ఫలితాన్ని ఆశిస్తుంది. అప్పుడు మన మనస్సు కలుషితం అవుతుంది. కలుషితం అయిన మనస్సు ఆత్మను అన్వేషించటానికి పనికిరాదు.**

రమణమహర్షి గారికి ఎవరినీ తిట్టడం అలవాటు లేదు. కానీ ఈ నేనుని మటుకు అదొక పిశాచం అని తిడుతూ ఉంటారు. దానికి రూపం లేకపోయినా ఏదో ఒక రూపాన్ని పట్టుకుంటూ ఉంటుంది అని చెప్పారు. ఈ అహంకారానికి రూపం లేదు. కానీ బాహ్యంగా ఏదో ఒక రూపాన్ని పట్టుకుంటుంది, ఏదో ఒక నామాన్ని పట్టుకుని వేలాడుతూ ఉంటుంది. అది చనిపోయేటప్పుడు కూడా ఏదో ఒక రూపాన్ని ధ్యానం చేసుకుంటూ, ఏదో ఒక నామాన్ని తలపెట్టుకుంటూ శరీరాన్ని విడిచి పెడుతుంది. మన శరీరానికేమో అన్నం మేత. ఈ అహంకారానికి రూపం ఒకటి, నామం ఒకటి, గుణం ఒకటి మేత. ఎవరినైనా మీరు చాలా మంచి వాళ్ళండి అనండి వాళ్లకు సంతోషం వస్తుంది. లోపల ఉండి సంతోషించేది ఎవరు? ఈ మిథ్యా నేనే. ఈ మధ్యన ఒక డాక్టరు గారు నన్నొక ప్రశ్న అడిగారు. నువ్వు మా పేషెంట్‌ని సరిగ్గా చూడలేదు అని ఎవరైనా ఆయనను విమర్శిస్తుంటే బాధ కలుగుతోంది అని చెప్పారు. అప్పుడు నేను ఏమన్నాను అంటే మీ ఆసుపత్రిలో ఎవరైనా బాగుపడ్డవారు ఉంటారు కదా, డాక్టరు గారు మీరు చాలా మంచి ఆయన, వైద్యం చాలా బాగా చేశారు అంటే మీకు సంతోషం వస్తుందా అని అడిగాను. సిగ్గు పడ్డారు అనుకోండి, కొంచెం వస్తుంది అన్నారు. డాక్టరు గారు మీరు చాలా గొప్పవారు అన్నప్పుడు మీకు సంతోషం వచ్చినప్పుడు, మిమ్మల్ని ఎవరైనా తిట్టినప్పుడు మీకు దుఃఖం కూడా తప్పనిసరిగా వస్తుంది, దానిని ఎదుర్కొన్నప్పుడు దీనిని కూడా ఎదుర్కోవాలి అని చెప్పాను. మీకు అర్థం అవుతోందా? అన్నదమ్ములు పంచుకొన్నప్పుడు కొబ్బరి చెట్లు గురించి, తాటి చెట్లు గురించి పేచీలు పెట్టుకుని కోర్టు దాకా వెళ్లిపోతూ ఉంటారు. అప్పటిదాకా అన్నగారేమో తమ్ముడు తమ్ముడు అంటూ ఉంటాడు. తమ్ముడేమో అన్నగారు అంటూ ఉంటాడు. ఏ గోడ దగ్గరో పేచీ వస్తుంది, హైకోర్టు దాకా వెళ్లిపోతారు. ఇది మాయ యొక్క ప్రభావం. మాయ అంటే ఏమీ లేదు, ఏదైతే లేదో అది మాయ.

అందుచేత మనం గ్రహించవలసింది ఏమిటంటే, మనకున్న తెలివి తేటలు కంటే, మనం విన్న బోధ కంటే, మనం చేస్తున్న ధ్యానం కంటే, మనం చేస్తున్న విచారణ కంటే అన్నిటికంటే గురువు అనుగ్రహం దేవుడి అనుగ్రహం ముఖ్యం. లోపల ఉన్న చైతన్యం తోటి తాదాత్మ్యం కావాలి అని అడుగుతున్నాడు. భార్యాభర్తలకి ఎలా తాదాత్మ్యం ఉంటుందో, ఇప్పుడు మీ ఆయనని నేను తిట్టాను అనుకోండి, మీ ఆయనను తిట్టాను కానీ మిమ్మల్ని తిట్టలేదు కదా, కానీ మిమ్మల్ని తిట్టినట్టే బాధపడిపోతారు. మీకు అర్థం అవుతోందా? ఎందుచేత? మీ ఆయన తోటి మీకున్న తాదాత్మ్యం. అదే విధంగా లోపల ఉన్న చైతన్యం తోటి, లోపల ఉన్న బ్రహ్మం తోటి తాదాత్మ్యం కావాలి, దానిని marriage చేసుకుంటాను

అంటున్నాడు. భగవాన్‌ని ఏమంటున్నాడు అంటే, నా హృదయంలో ఉన్న సద్వస్తువు తోటి నాకు బంధం కుదర్చండి. ఈ బాహ్యమైన బంధం కాదు. దానితోటి నాకు marriage కావాలి, లోపల ఉన్న చైతన్యం తోటి నాకు అనుబంధం కుదరాలి. దానితోటి అనుబంధం కుదిరితే ఈ బంధాలు అన్నీ తెగిపోతాయి. దేనితోటి అనుబంధం కుదిరాక, దేనితోటి తాదాత్మ్యం కుదిరాక బాహ్యమైన బంధాలు తెగిపోతాయో దానితోటి నాకు marriage కావాలి అని ఈ భక్తుడు అడుగుతున్నాడు. నీ దేహం తోటి నువ్వు ఏవిధంగా తాదాత్మ్యం పొందుతున్నావో అలాగ నీ లోపల ఉన్న చైతన్యం తోటి తాదాత్మ్యం పొందలేక పోవడానికి ఎవరో ఇతరులు కారణం కాదు, నీ వాసనలు, నీ సంస్కారాలు, నీ తలంపులు, నీ కోరికలే కారణం అంటున్నారు. అందుచేత ఎవరో వచ్చి నిన్ను కష్టపెడుతున్నారు. ఎవరో వచ్చి నిన్ను ఇబ్బంది పెడుతున్నారు అలా అనుకోకు. నీ తలంపులే నిన్ను ఇబ్బంది పెడుతున్నాయి. నీ కోరికలే నిన్ను ఇబ్బంది పెడుతున్నాయి. ఆచార్యుల స్వామి వారు ఏమని చెప్పారు అంటే ఒక మనిషికి ఎక్కడైనా దుఃఖం వస్తోంది అంటే, ఒక మనిషికి ఏదైనా వేదన వస్తుంది అంటే, ఆ మనిషికి ఎక్కడో మమకారం ఉండి తీరాలి. ఆ మనిషికి మమకారం లేకపోతే అసలు దుఃఖమే లేదన్నారు. మమకారం నశించినపుడు వెంటనే దుఃఖం కూడా నశిస్తుంది అన్నారు. మీకు అర్థం అవుతోందా? అందుచేత మమకారం వల్లే మనిషికి దుఃఖం వస్తుంది. మమకారం నశిస్తే దుఃఖానికి కారణమే లేదు. అందుచేత ఇక్కడ ఏమంటున్నాడు అంటే నాకు చైతన్యం తోటి marriage కావాలి అంటున్నాడు. ఆ బంధం నాకు కుదరడం లేదు అంటున్నాడు. దీనికి బయటి కారణాలు ఏమీ లేవు అయ్యా, నీ వాసనలే నీకు ఆ marriage కుదరనివ్వటం లేదు అంటున్నారు భగవాన్.

ఏ వస్తువును నువ్వు తెలుసుకోవాలి అని ప్రయత్నం చేస్తున్నావో, దేనికోసం నువ్వు పుణ్యాలు చేస్తున్నావో, వ్రతాలు చేస్తున్నావో, యజ్ఞాలు చేస్తున్నావో, యాగాలు చేస్తున్నావో, దేనికోసం అయితే నువ్వు తపస్సులు చేస్తున్నావో, ఆ వస్తువు నీకు అనుభవంలోకి వచ్చిన తరువాత ఈ వాసనలు వేరుతో సహా అప్పుడు నశిస్తాయి అంటున్నారు. బ్రహ్మానుభవం అయ్యిన తరువాత నీలోఉన్నటువంటి ఆ దేహబుద్ధి పూర్తిగా నశిస్తుంది. ఈ దేహం మీదన్న సంగతి మీకు తెలుస్తోంది. ఇప్పుడు ఈ దేహం నాదనేబుద్ధి మీకు ఎంత సహజంగా ఉందో, ఆ లోపల ఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోకి వచ్చాక ఆత్మబుద్ధి మీకు అంత సహజంగా కలుగుతుంది. దేహబుద్ధి నశించిన వెంటనే ఆత్మబుద్ధి కలుగుతుంది. మహా మాయ ఎక్కడ ఉంది అంటే ఏ నేను లోంచి అయితే మనం విడుదల పొందాలో, ఆ నేను లోంచి మనం విడుదల పొందడం మానేసి దీనిని ఎక్కడికో కైలాసానికి తీసుకు వెళ్ళాలి,

స్వర్గ లోకానికి తీసుకు వెళ్ళాలి అని ప్రయత్నాలు చేస్తున్నాం ఇదే మహా మాయ. అందుచేత నువ్వు కాని దాంట్లోంచి విడుదల పొందే వరకు నువ్వు ఎవరో నీకు తెలియదు. ఈ భక్తుడు ఏమంటున్నాడు అంటే బ్రహ్మానుభవం కలిగితేనే కానీ వాసనా క్షయం కాదు. వాసనా క్షయం అయితేనే కానీ బ్రహ్మానుభవం కాదు అని చెబుతున్నారు ఇదంతా చిక్కుగానే ఉంది అంటున్నాడు. భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే simultaneousగా చేసుకు వెళ్ళు అంటున్నారు. మీకు అర్థం అవుతోందా? అలాగే ఒక పక్క మనం రోగానికి మందు వాడతాం, పత్యం చేస్తూ ఉంటాం. ఒక పక్కన వాసనలు తగ్గించుకుంటూ ఉండాలి, ఆ బ్రహ్మం గురించి శ్రవణం చేస్తూ ఉండాలి. Simultaneousగా చేసుకు వెళ్తూ ఉండాలి. ఏది ముందు, ఏది వెనక ఆ గొడవ వద్దు.

ఈ అజ్ఞానం మాకు ఎప్పుడు వచ్చింది అని అడుగుతూ ఉంటారు. ఎలా వచ్చింది? దానికి గౌతమ బుద్ధుడు ఏమని చెప్పాడు అంటే, నీకు రోగం వచ్చింది ఆ రోగం తగ్గించుకోవడానికి ప్రయత్నం చెయ్యి, రోగం ఎప్పుడు ఎప్పటి నుంచి వచ్చింది అని తెలుసుకునే కంటే ఉన్న రోగాన్ని తగ్గించుకోడానికి ప్రయత్నం చెయ్యి. నీకు అజ్ఞానం ఎప్పుడు వచ్చింది అని ప్రశ్నించుకోవడం కంటే దాంట్లోంచి విడుదల పొందడానికి ప్రయత్నం చెయ్యి. నీ కాళ్ళలో ముల్లు విరిగింది అనుకో ఆ ముల్లును తీసుకోవడానికి ప్రయత్నం చెయ్యి. అంతేకాని ముల్లును నువ్వు బయటకి తీసుకోవడానికి ప్రయత్నం మానేసి ఎప్పుడు విరిగింది ఎక్కడ విరిగింది అని విచారణ చెయ్యడం వలన నీకు కలిసి వచ్చేది ఏమీ లేదు. ఎనర్జీ waste, టైం waste అంటున్నారు. మనం అక్కర్లేని గొడవలకి వెళ్ళకూడదు. మనకి అక్కర్లేని గొడవలకి వెళితే అహంకారం పెరుగుతుంది. మనం ప్రతీ విషయంలోను కలుగజేసుకో కూడదు. దానివల్ల కూడా అహంకారం పెరుగుతుంది. సాధ్యమైనంత వరకు ఇతర గొడవలలో కలుగజేసుకోవద్దు అని రమణాచార్యుడు చెబుతున్నాడు. ఒక్కొక్కసారి మనం కలుగజేసుకోకుండా ఉంటేనే ఆ గొడవ పరిష్కారం అవుతుంది. మనం వెళ్లి పెద్దది చేసేస్తాం. అందుచేత సాధ్యమైనంత వరకు కొన్ని కొన్ని గొడవలలో మనం కలుగజేసుకోకుండా ఉంటేనే మంట ఆరిపోతుంది. కొంతమంది ఆ మంట ఆర్పుతాం అని చెప్పి మంట పెంచేస్తూ ఉంటారు. ఇటువంటి గొడవలలో సాధ్యమైనంత వరకు మనం కలుగజేసుకోకుండానే ఉండాలి. ఇతర గొడవలలో మనం ఎక్కువ కలుగజేసుకుంటాం అనుకోండి దానివల్ల మనకి అహంకారం పెరుగుతుంది.

తరువాత ఇంకొకటి చెప్పారు భగవాన్, నువ్వు ఇతరులకి ఏమి ఇచ్చినా అది నీకు తిరిగి వచ్చేస్తుంది అన్నారు. ఇతరులకి నువ్వు ఏదైనా సహాయం చేశావు అనుకో ఒక

మాట సహాయం కానీ, వస్తు సహాయం కానీ అది ఏ రూపంలో నువ్వు సహాయం చేసినా అది తిరిగి నీకే వచ్చేస్తుంది అన్న సంగతి నీకు తెలిస్తే ఇతరులకి నువ్వు సహాయం చెయ్యకుండా ఎలా ఉండగలవు అన్నారు. ఇతరులకి మనం ఏదైనా సహాయం చేసినా పరమేశ్వరుడు తిరిగి మనకి వడ్డీతో సహా అది ఇచ్చేస్తాడు. ఇక్కడ మనం గ్రహించవలసిన విషయం అది. మీకు మీ ఆయన అంటే ఎక్కువ ఇష్టం అని అనిపిస్తుంది, కాని అది నిజం కాదు, నేను అంటేనే మీకు ఎక్కువ ఇష్టం. మీకు అర్థం అవుతోందా? ఆ నేనుకి అనుకూలంగా మీ ఆయన ఉంటే చాలా మంచి ఆయన అనుకుంటారు, ఆ నేనుకి అనుకూలంగా మీ ఆయన లేకపోతే మీ ఆయనని చాటుగా అయినా తిడతారు ఎదురుగా తిట్టకపోయినా, ఆ నేను అంటేనే ఇష్టం ప్రతీవాడికి, ఆ నేను కోసమే ప్రతీవాడు జీవిస్తున్నాడు. ప్రతీ మనిషి జీవించేది వాడి అహంకారం కోసం వాడు జీవిస్తున్నాడు.

రమణమహర్షి గారు ఏమని చెబుతున్నారు అంటే నీకున్న భక్తి నిజం అయితే నీ అహంకారాన్ని దేవుడికి ఆహారంగా ఇచ్చేయాలి. ఏది? ఈ నేనుని ఆహారంగా మనం ఆయనకి ఇచ్చేయాలి. మనకి దేవుడు కావాలా? అహంకారం కావాలా? ఇది బాగా అర్థం చేసుకోండి. మనకి దేవుడు కావాలంటే అహంకారం వదులుకోవాలి. అహంకారం కావాలంటే దేవుడిని వదులుకోవాలి. ఆచార్యుల వారు అన్నారు కంచంలో ఉన్న అన్నం కంచంలో ఉండిపోవాలి, మా అబ్బాయి కడుపు నిండిపోవాలి అంటే ఎలా కుదురుతుంది అన్నారు. రెండింటిలో ఏదో ఒకటి వదులుకోవాలి. అహంకారాన్ని అయినా వదులుకోవాలి, దేవుడినైనా వదులుకోవాలి. అహంకారం వదులుకుంటే దేవుడు తెలియబడతాడు. నువ్వు అహంకారం వదులుకోవు అనుకో నీకు దేవుడు తెలియబడడు. దేవుడు ఉన్నాడు కానీ మనం లేము. కానీ మనం ఏమనుకుంటున్నాం అంటే దేవుడు లేడు, మనం ఉన్నాం అనుకుంటున్నాం. ఉన్న దానిని లేదు అనుకుంటున్నాం, లేని దానిని ఉంది అనుకుంటున్నాం. అలా అనిపించడానికి కారణం ఏమిటి? మనలో ఉన్నటువంటి అలవాట్లు యొక్క వేగం వల్ల, మనలో ఉన్నటువంటి అజ్ఞానం వల్ల అలా అనిపిస్తుంది. మనిషికి ఏ రకమైన దుఃఖం వస్తున్నప్పటికీ, ఏ రకమైన టెన్షన్ వస్తున్నప్పటికీ, ఏ రకమైన వేదన వస్తున్నప్పటికీ లోపల అజ్ఞానం ఉన్నట్టే గుర్తు. లోపల అజ్ఞానం లేకపోతే దుఃఖం రాదు, వేదన రాదు, రోదన రాదు. లోపల అజ్ఞానం కనుక లేకపోతే మనిషికి టెన్షనే రాదు. భగవాన్ ఏమంటున్నారు అంటే అజ్ఞానం వల్లే చిక్కులు, పరస్పర విభేదాలు కూడా అందుకే వస్తున్నాయి. మేము ఆత్మని తెలుసుకోవాలి, దేవుడిని తెలుసుకోవాలి, అని మీరు అందరూ కంగారు పడుతున్నారు. ఆ దేవుడిని తెలుసుకునే ఈ నేను ఎవరో ముందు మీరు తెలుసుకోండి, తరువాత దేవుడి గొడవ తెలుసుకోవచ్చు అంటున్నారు. ఇప్పుడు అందరం మనం

ఏమనుకుంటున్నాం? దేవుడిని తెలుసుకోవాలి, దేవుడిని తెలుసుకోవాలి అని అనుకుంటున్నాం కదా, దేవుడిని తెలుసుకోందురు గానీ దేవుడిని తెలుసుకోవడానికి ఒక నేను ఉండాలి కదా, ఆ నేను ఎవరో తెలుసుకోండి. ఫాలో అవుతున్నారా మీరందరూ? దేవుడిని తెలుసుకోవాలి అని ఎవరు అంటున్నారు? నేను అంటున్నాను. అందుచేత దేవుడిని తెలుసుకోవాలి అనుకునే ఈ నేను ఎవరో ముందు మీరు తెలుసుకోండి తరువాత దేవుడు ఎవరో మీకు తెలుస్తుంది అన్నారు. ఈ నేను ఎవరో మీకు తెలియనప్పుడు దేవుడు ఎవరో కూడా మీకు తెలియదు అన్నారు. ఎందుచేత? ఈ నేను యొక్క మూలంలోనే దేవుడు ఉన్నాడు. ఈ నేను ఎవడో మీకు తెలియకుండా నాకు దేవుడు కనిపించాడు, దేవుడు తోటి నేను మాట్లాడాను, దేవుడిని చూశాను అంటే అవి కేవలం మానసిక దృశ్యాలే అన్నారు. మనసులో కనిపించే దృశ్యాలు మాత్రమే.

నా కూడా నీడని రావద్దని నేను అంటాను అనుకోండి కానీ అది రావడం మానుతుందా? అలాగే ఎవడైతే ఆత్మజ్ఞానం పొందాడో, ఎవడైతే ఆత్మానుభవం పొందాడో, ఎవడైతే చైతన్యాన్ని అందుకున్నాడో, మనిషి కూడా నీడ ఎలా వస్తుందో, అలాగే ఆత్మజ్ఞానం పొందిన వాడి కూడా ఆత్మ శాంతి అలా వస్తుంది. మనిషిని నీడ విడిచి పెట్టదు. అలాగే ఆత్మ జ్ఞానిని ఆత్మ శాంతి కూడా వాడిని విడిచి పెట్టదు. మన దుఃఖానికి కారణం మన తోడి కోడళ్ళు, మన అత్తగారు, మన మామగారు అనుకుంటాం కానీ ఇక్కడ రమణమహర్షి చెప్పేది ఏమిటి అంటే దుఃఖానికి కారణం బయట ఏమీ లేదు. నీ దుఃఖానికి కారణం లోపలే ఉంది. ఆ దుఃఖానికి కారణం అహంకారమే, అహం వృత్తే. దుఃఖానికి కారణం నశిస్తేనే కానీ దుఃఖం నశించదు. అందుచేత అహం వృత్తిని నిరోధించు అని చెపుతున్నారు. అహంకారాన్ని నిరోధించడానికే, అహంవృత్తిని నిరోధించడానికే ఈ శ్రవణాలు, ఈ బోధలు, ఇవన్నీ! కర్మని బట్టి జన్మ వస్తుంది అంటున్నారు, బాగానే ఉంది. ఏదో పురాణాలు చెబుతున్నాయి ఆ మాటలు, ఆ కర్మ నుండి విడుదల అవ్వడం ఎలాగా అన్నారు. కర్మ ఎవరికి అన్నారు భగవాన్ మళ్ళీ, వీడు నేనుకి అన్నాడు. ఆ నేను లోంచి విడుదల పొందితే కర్మ లోంచి కూడా విడుదల పొందుతావు అన్నారు. మళ్ళీ ఇక్కడకి తీసుకువచ్చేస్తారు, నాలుగు మొట్టికాయలు కొట్టి వాడిని ఈ నేను దగ్గరకి తీసుకువచ్చేస్తారు. ఆ నేను దగ్గర నుంచి దూరం వెళ్ళనివ్వరు. కర్మ ఎవరికి అన్నారు? వాడు ఏమన్నాడు? నేనుకి అన్నాడు. ఆ నేను లోంచి విడుదల పొందితే కర్మ లోంచి కూడా విడుదల పొందుతావు అన్నారు. ఆ replies చూడండి wonderful replies. ఇందులో ఒక కారణం ఉంది. మనం మంచి చేసినా, చెడ్డ చేసినా దేహగతమైన నేను తోటే చేస్తాం. దేహం నేను అనుకునే మంచి చేసినా, చెడ్డ చేసినా చేస్తాం. రాబోయే జన్మలలో దేహం నేను కాకపోయినా ఆ దేహం నేను

అనేబుద్ధి మనకి ఉంచి అది అనుభవానికి తీసుకు వస్తాడు పరమేశ్వరుడు. మీకు అర్థమవుతుందా? దేహం నేను అనేబుద్ధి మనకి ఉంది. దేహం నేను కానప్పుడు దేహం నేను అనేబుద్ధి నాకు ఎందుకు ఉంది అంటే, నువ్వు కర్మ అనుభవించడం కోసం పరమేశ్వరుడు దూడని కట్టురాడుకి కట్టేసినట్టు నిన్ను ఈ దేహానికి కట్టేశాడు.

మనం ధ్యానం చేస్తుంటే, విచారణ చేస్తుంటే, కొంతదూరం వెళ్లిన తరువాత నువ్వు ఇలా అయిపోయావు, నువ్వు అలా అయిపోయావు, నువ్వు అప్పడే జ్ఞానివి అయిపోయావు, నువ్వు పెద్ద మహాత్ముడవు అయిపోయావు, నువ్వు పెద్ద గురువు అయిపోయావు అని మనసు చెబుతూ ఉంటుంది అట మనకి. ఈ మనస్సు చెప్పే సమాధానాలు చూసుకుని, అహంకారం చెప్పే సమాధానాలు చూసుకుని మోసపోకు, అక్కడ ఆగిపోకు అని చెపుతున్నారు. ఇక్కడ నుంచి నరసాపురం వెళ్దాం అని బయలుదేరాం అనుకోండి, ఒక పర్లాంగు వెళ్లి ఆగిపోతే నరసాపురం ఎలా వస్తుంది? అలా నువ్వు సాధన ప్రారంభించావు అనుకో, ప్రారంభిస్తే సరిపోతుందా? నువ్వు పవిత్రుడవు అయిపోయావు, గురువు అయిపోయావు, జ్ఞానివి అయిపోయావు అని నీ మనస్సే చెబుతుంది. మనస్సు ఏ సమాధానం చెప్పినా దొంగ సమాధానమే. ఎందుచేత అది దొంగ కాబట్టి అక్కడ ఆగిపోవద్దు అంటున్నారు. అసలు మనస్సే అబద్ధం అయినప్పడు అది చెప్పే సమాధానాలు నిజం ఎలా అవుతాయి? అంటున్నారు. దానిని ఒక పక్కకి పెట్టి నీ ప్రయాణం ఏదో నువ్వు చూసుకో అంటున్నారు భగవాన్. ఆత్మానుభావానికి ఏమి సహాయపడతాయి అని అడుగుతున్నారు. వేదంలో ఏమి ఉందో, భగవద్గీతలో ఏమి ఉందో దానిని నువ్వు ప్రమాణంగా తీసుకో, తరువాత బ్రహ్మానుభవం ఎవడు పొందాడో వాడు చెప్పిన మాట కూడా నువ్వు ప్రమాణంగా తీసుకో, ఎవడికైతే బ్రహ్మానుభవం కలిగిందో, ఎవడైతే చైతన్య స్థాయిని అందుకున్నాడో, మనకు దేహం ఏ విధంగా అయితే నేనుగా స్ఫురిస్తుందో, అలా ఎవడికైతే చైతన్యం నేనుగా స్ఫురిస్తుందో వాడు చెప్పిన మాట కూడా నువ్వు ప్రమాణంగా తీసుకోవచ్చు అని చెబుతున్నారు.

మనం పని చేస్తున్నాం, భగవంతుడు పని చెయ్యడం లేదు అని మనం అందరం అనుకుంటాం. భగవంతుడు కూడా పని చేస్తున్నాడు. ఎలా పని చేస్తున్నాడు? ఆయన చేసే పని ఏదో సైలెంట్ గా చేసుకుని వెళ్లిపోతాడు. చేస్తున్నట్టు మనకి కనపడే కనపడడు అసలు. మనం పని చెయ్యకపోయినా ఇతరులు అందరూ మనం పని చేస్తున్నట్టు చెప్పకోవాలి అని మన ఉద్దేశ్యం. మనకి ఇతరులు ఉన్నారు కాబట్టి, ఇతరులు దగ్గర నుంచి మనం గొప్ప ఆశిస్తాము. భగవంతుడికి ఇతరులు లేరు కాబట్టి ఆయన సైలెంట్‌గానే చేసుకు పోతాడు. ఇతరులు చేసే స్తోత్రాలు ఆయనకి అక్కర్లేదు. భగవంతుడు ఏ రకంగా పని

చేస్తున్నాడో ఆ రకంగా మనం పని చెయ్యడం నేర్చుకుంటే ఆయన స్వరూపాన్ని మనకి ఇస్తాడు, ఆయన స్వరూపాన్ని మనం పొందుతాము. ఈ బోధలు, ఈ సంవాదాలు, ఈ ఉపన్యాసాలు, ఈ ధ్యానాలు ఇవన్నీ కూడా సెకండరీ. భగవాన్ చెబుతున్నారు అన్నిటికంటే అత్యంత బలీయమైనది, అత్యంత ముఖ్యమైనది గురువు అనుగ్రహం. గురువు అంటే ఎవరు? ఆత్మ, బ్రహ్మం. బ్రహ్మానుభవం ఎవడైతే పొందాడో వాడి glance, వాడి touch ద్వారా వీడి మనసు పక్వానికి వచ్చి వీడికి బ్రహ్మానుభవం కలుగజేస్తుంది అన్నారు. ఒక్క చూపు చాలు, ఒక్క టచ్ చాలు. వాడి మైండ్ పక్వానికి వచ్చేవరకు వాడిని తరుముతూ ఉంటుంది వాడు ఏ జన్మలో ఉన్నా సరే, వాడి చూపు విడిచి పెట్టదు, వాడి స్పర్శ విడిచి పెట్టదు. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మన సుఖం కోసం కానీ, మన శాంతి కోసం కానీ, బాహ్య వస్తువుల మీద కానీ, బాహ్య వ్యక్తుల మీద కానీ, బాహ్య పదార్థాల మీద కానీ, ఆధారపడకుండా మనం స్వతంత్ర్యంగా సుఖాన్ని, శాంతిని అనుభవిస్తుంటే అప్పుడు మన చైతన్య స్థాయి పెరిగినట్టు. రోజూ మాట్లాడే వాడు ఒక రోజున మాట్లాడడం మానేస్తే వీడికి దుఃఖం వచ్చేస్తుంది. ఇది ఏమిటి అంటే బానిసత్వం. లోకం మనల్ని గౌరవిస్తే ఏమిటి? గౌరవించకపోతే ఏమిటి? ఎవడికి కావాలి ఈ గౌరవం? గౌరవం అహంకారానికే, అగౌరవం అహంకారానికే! గొప్పలు అన్నీ ఎవరికి? అహంకారానికే, ఈ సన్మానాలు ఎవరికి? అహంకారానికే. అదే భగవాన్ చెప్పారు అహంకారం ఉంటే అంతా ఉంది. అహంకారం ఉంటే నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను, ప్రపంచం ఉంది, లోకం ఉంది, అన్నీ ఉన్నాయి. అహంకారం ఉంటే అంతా ఉంది. అది లేకపోతే ఏది లేదు. సింపుల్ పాయింట్ ఇది, కంగారు పడకండి, మీరు complicate చేసుకోవద్దు, truth కూడా సింపుల్ గానే ఉంటుంది.

నేను అనేబుద్ధి మీకు లోపల నుంచి ఉదయిస్తుందా? బయట నుంచి ఉదయిస్తుందా? లోపల నుంచే ఉదయిస్తుంది. నేను అనేబుద్ధి ఉంది అన్న సంగతి మీకు అందరికి తెలుసు కానీ అది ఎక్కడ నుంచి ఉదయిస్తుందో మీకు తెలియడం లేదు. ఆ ఉదయించే ప్లేస్ కనుక మీకు అనుభవంలోకి వస్తే మీకు అందరికీ జ్ఞానం కలుగుతుంది. ఇతరుల మీద ఆధారపడిన సుఖం ఎంతకాలం ఉంటుంది? ఇతరుల మీద ఆధారపడిన శాంతి ఎంతకాలం ఉంటుంది మనకి? ఇతరుల మీద ఆధారపడి జీవిస్తుంటే వాళ్లకి ఎప్పుడు కోపం వస్తే అప్పుడే మన జీవితం పాడైపోతుంది కదా, ఎంతకాలం బానిసత్వం? కొంతమంది ఇతరులని అగౌరవంగా చూస్తారు, అగౌరవంగా మాట్లాడతారు. వాళ్లకి అహంకారం పెరుగుతుంది. ఇతరులు ఎటువంటి వారు అయినా వాళ్ళు మంచివారు అయినా, చెడ్డవారు అయినా, వాళ్లని గౌరవంగా చూడడం వలన, వాళ్లని మర్యాదగా చూడడం వలన మనకున్న

అహంకారం తగ్గుతుంది. ఇతరులని అగౌరవంగా చూస్తాము అనుకోండి మనకున్న అహంకారం పెరిగిపోతుంది. భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే మీరు దేహంగానో, ఇంద్రియాలుగానో, మనస్సుగానో, బుద్ధిగానో, అహంకారంగానో ఉంటున్నారు. ఏదో ఒక రకంగా ఉంటున్నారు కదా. మీ మనస్సుని ఎవరైనా ఏమైనా అంటే మీకు ఎంతో ఉద్రేకం వచ్చేస్తుంది. ఎందుచేత అంటే దానితోటి మీకు తాదాత్మ్యం ఉంది కాబట్టి. నల్లగా ఉన్న వాడిని నువ్వు నల్లగా ఉన్నావు అనండి పాపం వాడికి ఎంత దుఃఖం వచ్చేస్తుందో! ఎందుచేత? వాడు రంగుతో తాదాత్మ్యం పొందుతున్నాడు కాబట్టి, మీరు నల్లగా ఉంటున్నారు, తెల్లగా ఉంటున్నారు, ఎర్రగా ఉంటున్నారు, అహంకారంగా ఉంటున్నారు, మనస్సుగా ఉంటున్నారు, దేహంగా ఉంటున్నారు ఏదో ఒక రకంగా ఉండటం తప్పటం లేదు. ఆ ఉండటం ఏదో ఆత్మగా ఉండండి అంటున్నారు. చైతన్యం తోటి తాదాత్మ్యం పొందండి, ఈ దేహం తోటి తాదప్యం పొందే బదులు చైతన్యం తోటి తాదాత్మ్యం పొందండి. దానికి రూపం లేదు, రంగు లేదు. దానికి నామం లేదు, దానికి గుణం కూడా లేదు. గుణాలన్నీ మనసులో ఉన్నాయి. ఆ గడప దాటితే అక్కడ గుణాలు లేవు.

ఇంగ్లీషులో ఒక సామెత ఉంది. మీ ఇల్లు చీకటిగా ఉంది అనుకోండి, కరెంట్ ఆగిపోయింది అనుకోండి, కరెంట్ ఆగిపోయింది, కరెంట్ ఆగిపోయింది అని కూర్చొని కరెంట్‌ని తిట్టకండి ఒక కిరసనాలు దీపం వెలిగించుకోండి అని చెప్పారు. అంటే దీపం వెలిగించుకోవడం వలన చీకటి ఎలా పోతుందో, అలా మీరు జ్ఞానాన్ని సంపాదించు కోవడానికి ప్రయత్నం చెయ్యండి. మీలో ఏమైనా దోషాలు ఉంటే పోతాయి. దీపం వెలిగించుకోగానే చీకటి ఎలా పోతుందో, అలాగే మీరు జ్ఞానాన్ని సంపాదించుకుంటే మీలో ఒకవేళ నిజంగా చెడ్డ ఉన్నా, ఆ చెడ్డ పోతుంది. చీకటిగా ఉన్నప్పుడు చీకటిగా ఉంది, చీకటిగా ఉంది అనుకుంటే ఆ చీకటి పోదు, ఒక దీపం వెలిగించుకుంటే ఆ చీకటి పోతుంది. అదే విధంగా మేము చెడ్డ వాళ్ళం, మేము చెడ్డ వాళ్ళం అని మీరు అనుకోవద్దు. నిజంగా చెడ్డ వాళ్ళు అయినా మీరు అనుకోవద్దు. జ్ఞానాన్ని సంపాదించడానికి ప్రయత్నం చెయ్యండి.



**మనస్సు ఎంత సూక్ష్మం అయితే, మనస్సు ఎంత పరిశుద్ధం అయితే, మనస్సు ఎంత ఏకాగ్రం అయితే, అది అంత హృదయం వైపుకి ప్రయాణం చేస్తుంది.**

వెలుతురు రాగానే చీకటి ఎలా పోయిందో, మీకు ఎప్పుడైతే జ్ఞానం కలిగిందో మీలో ఏమైనా చెడ్డ ఉన్నా అది పోతుంది. అంతే కానీ జ్ఞానం సంపాదించుకోవడం మానేసి మేము చెడ్డ వాళ్ళం, మేము చెడ్డ వాళ్ళం, ఇలా కూడా అనుకోవద్దు అంటున్నారు భగవాన్. మనం ఏదైనా సాధన మొదలు పెట్టాము అనుకోండి జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం వస్తాయి. అంటే మాయ ఏమి చేస్తుంది అంటే వీడికి జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం తీసుకువద్దాం, సాధన వదిలేస్తాడు అని ఆ మాయ, ఆ సైతాను ఏమి చేస్తుంది అంటే జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం చేస్తుంది. ఆ గొడవలు జ్ఞాపకం వచ్చేటప్పటికీ వీడికి కోపం వస్తుంది, కూర్చున్నవాడు లేచిపోతాడు. జరిగిపోయిన గొడవలు జ్ఞాపకానికి వస్తే మనం పడము అనుకోండి ఇంక రాబోయే రోజులు ఎలా వెళతాయి? అది కూడా మాయే! నీ చేతిలో వర్తమాన కాలం ఉంది. నీ చేతిలో ఉన్న వర్తమాన కాలాన్ని విడిచిపెట్టకు. భవిషత్ కాలంలో నువ్వు మేడలు కట్టకు. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవద్దు. నీ చేతిలో ఏముంది? వర్తమాన కాలం ఉంది. దానిని గాఢంగా జీవించు అంతే నీకు జ్ఞానం వచ్చేస్తుంది. మనం ఏమి చేస్తున్నాం? ఈ వర్తమాన కాలాన్ని వదిలేసి రాబోయే గొడవలు అది ఏమవుతుంది? ఇది ఏమవుతుంది? అని భయపడటం, అధైర్యం తెచ్చుకోవడం, పిరికితనం తెచ్చుకోవడం. మనిషి ఒకేసారి చస్తాడు, ఇన్నిసార్లుచావడు. శరీరం ఎన్నిసార్లు చస్తుంది? రోజూ చచ్చిపోతుందా? కానీ పిరికివాడు రోజూ చచ్చిపోతాడు అని Shakespeare చెప్పాడు.

అన్నిటికంటే అత్యంత నీచమైనది హృదయదౌర్బాల్యం అని పరమాత్మ గీతలో చెప్పాడు. అందుచేత మనం భవిషత్ కాలం గురించి ఎక్కువ ఊహించవద్దు, జరిగిపోయిన గొడవలు మనం తలపెట్టుకోవద్దు. జరిగిపోయిన గొడవలు మనం తలపెట్టుకోవడం వలన మనకి ఒక్క పైసా కూడా కలిసిరాదు. చేతిలో వర్తమాన కాలం ఉంది, నువ్వు ధ్యానం చేస్తావో, విచారణ చేస్తావో, ఆరాధన చేస్తావో, పూజ చేస్తావో, ఏది చేస్తావో చేతిలో ఉన్న కాలాన్ని ఉపయోగించుకో, నీ చేతిలో ఉన్న కాలాన్ని నువ్వు ఉపయోగించుకుంటే భవిషత్ కాలం దాని జాగ్రత్త అది పడుతుంది. దాని గురించి నువ్వు కంగారుపడకు అంటున్నారు భగవాన్. దాని జాగ్రత్త అది పడుతుంది. మీరు వర్తమాన కాలాన్ని విడిచి పెట్టేస్తున్నారు. వర్తమాన కాలాన్ని విడిచి పెట్టవద్దు అని చెబుతున్నారు. అందులో గాఢంగా జీవించు, వర్తమాన కాలంలో నువ్వు సజీవంగా ఉండు అంటున్నారు. ఇక్కడ ఒక క్లూ చెబుతున్నారు భగవాన్, ఇది బాగా మననం చేసుకోండి. మీకు దేహం గొడవ లేనప్పుడు, మనస్సు గొడవ లేనప్పుడు, ప్రపంచం గొడవ లేనప్పుడు నిద్రట్లో నువ్వు ఉన్నావు. కానీ అక్కడ దేహం గొడవ కానీ,

లోకం గొడవ కానీ, దేవుడు గొడవ కానీ ఏ గొడవ నీకు లేదు. ఎప్పుడు? నిద్రట్లో, కానీ నువ్వు ఉన్నావు. వాడు ఇప్పుడు జాగ్రదావస్థలో కూడా ఉన్నాడు. వాడిని వెతికి పట్టుకుంటే నీకు జ్ఞానం కలుగుతుంది. అప్పుడు ఈ జనన, మరణ ప్రవాహం అనే స్వప్నం లోంచి నీకు మెలకువ వస్తుంది. కల నిజమా? మెలకువ నిజమా? అంటే మెలకువ నిజం, కల నిజం కాదు. ఈ జీవితం అంతా కల. మీకు బ్రహ్మానుభవం కలిగిన వెంటనే ఈ తలంపుల తోటి ఆధారపడిన ఈ నామరూప జగత్తు, ఈ తలంపులు ఇవన్నీ కూడా కలలు అనే సంగతి నీకు తెలుస్తుంది. ఈ శరీరం పోయి మళ్ళీ ఇంకో కొత్త శరీరం వస్తుంది మనకి అది కూడా కలే. శరీరాలు అన్నీ కలలో ఒక భాగాలే. దీనికి చక్కటి ఉదాహరణ ఒకటి చెప్పారు భగవాన్ దీనిని మీ గుండెకి బాగా పట్టించుకోండి. మనకి స్వప్నంలో అనేక దేహాలు వస్తాయి. మనం మల్కిపురంలోనే ఉంటాం. స్వప్నంలో మనసు కొన్ని దేహాలు కల్పిస్తుంది. ఈ దేహం మంచం మీదే ఉంటుంది. నా మనసు కల్పించిన దేహం రాజోలు, అమలాపురం వెళ్లి తిరిగి వస్తుంది. మెలకువ వచ్చాక అంటే జాగ్రదావస్థలోకి మనం వచ్చాక మనసు కల్పించిన దేహం ఏమయ్యింది అని ఆ ధ్యాస మనకి ఉండదు. ఎందుచేత ఉండదు? ఆ దేహం అసత్యం అన్న సంగతి తెలిసిపోయింది. నీకు బ్రహ్మానుభవం కలిగిన తరువాత నువ్వు ఎన్ని జన్మలు ఎత్తావో, ఎన్ని శరీరాలలోచనిపోయావో, ఆ కోట్లాది శరీరాలు అన్నీ కూడా, మనస్సు కల్పించిన శరీరాలు ఎటువంటివో, ఈ శరీరాలు కూడా అటువంటివే అన్న సంగతి బ్రహ్మానుభవం కలిగాక నీకు తెలుస్తుంది అన్నారు భగవాన్.

కోపం వచ్చినప్పుడు ఏమి మాట్లాడుతున్నామో మనకి తెలియదు. ఉద్రేకం వచ్చినప్పుడు మనకి మనం దూరం అవుతూ ఉంటాం. అందుచేత యేసు తన చివరి రోజులలో ఆయన శిలువ వేసినప్పుడు ఇటువంటి మాటలు విని ప్రార్థించాడు. ఓ తండ్రి వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు, వారు ఏమి మాట్లాడుతున్నారో వారికి తెలియదు, వారిని క్షమించి ఆశీర్వదించు అన్నాడు. మనకి ఎప్పుడైనా కోపం వచ్చినప్పుడు ఏమి చెయ్యాలి అంటే ఐదు నిమిషాలు నోటికి తాళం వేసుకోవడం మంచిది. అంటే మాట్లాడడం మానేయాలి. కోపం టైములో మాట్లాడతాం అనుకోండి మన నోటి వెంట మంచి మాటలు రావు, చెడ్డ మాటలు వస్తాయి. ఆ చెడ్డ మాటలకి, ఈ జన్మలో అయినా, మన రాబోయే జన్మలో అయినా మన మాటలకి మనం సమాధానం చెప్పకోవాలి. అందుచేత ఎప్పుడైనా ప్రశాంతంగా ఉన్నప్పుడు మాట్లాడవచ్చు కానీ కోపంగా ఉన్నప్పుడు ఆ పది నిమిషాలు మాట్లాడడం మానేస్తే మంచిది, మౌనంగా ఉండడం మంచిది. ఎవరైనా ఏదైనా అడుగుతారు అనుకోండి మనలని, వెంటనే ఆలోచన తట్టదు అనుకోండి ఆలోచించి

చెబుతాం అని చెప్పడం మంచిది.

సాధన అంటే ప్రయత్నం. ఇప్పుడు మనం నిజమైన స్థితిలో ఉన్నామనుకోండి ప్రయత్నం అక్కర్లేదు. నిజమైన స్థితిలో లేము కాబట్టే ప్రయత్నం చెయ్యవలసి వస్తుంది. మనం జ్ఞానం సంపాదించాలి, దేవుడిని తెలుసుకోవాలి అనుకుంటున్నాం, ఎందుకు జ్ఞానం సంపాదించడం? ఎందుకు దేవుడిని తెలుసుకోవడం? మనలో ఏదో వెలితి ఉంది. మనం పూర్ణ స్థితిలో లేము అన్న సంగతి మనకి తెలుస్తోంది. మనం ఉన్నది కరెక్ట్ స్టేట్ కాదని మనకి తెలుస్తోంది. మనం ఉన్నది కనుక కరెక్ట్ స్టేట్ అయితే, మనం ఉన్నది కనుక రైట్ స్టేట్ అయితే దేవుడిని తెలుసుకోవాలి అనేబుద్ధి కూడా మనకి అక్కరలేదు. మనలో ఉన్న వెలితి వల్లే ఏదో ఒకటి తెలుసుకోవాలి అనిపిస్తుంది. యదార్థ స్థితిలో మనం లేము. యదార్థ స్థితిలో మనం లేము కాబట్టి సాధన చెయ్యవలసి వస్తుంది. యదార్థ స్థితి మనం తెలుసుకున్నాక, యదార్థ స్థితి మనకి అనుభవంలోకి వచ్చాక సాధన తోటి పనిలేదు.

సాధనకి సంబంధించినంత వరకు భగవాన్ ముఖ్యంగా మూడు మాటలు చెప్పారు. ఒకటి ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండమన్నారు. మనం అందరం రోజూ రెండు పూటలా భోజనం చేస్తున్నాం కదా, భోజనం చేసేటప్పుడు మనసు చెప్పినట్టు వినకూడదు, దేహం చెప్పినట్టు వినాలి. దేహం సరిపోతుందని చెబుతూ ఉంటుంది. నువ్వు తిన్నది సరిపోతుంది. ఎక్కువ రుచిగా ఉంది అనుకోండి మనసు ఏమంటుంది? లోపలకి గెంటేయ్, గెంటేయ్ అంటుంది. అందుచేత అన్నం తినేటప్పుడు, ఏదైనా పదార్థం తినేటప్పుడు మీరు బాగా జ్ఞాపకం ఉంచుకోవాల్సిన విషయం ఏమిటి అంటే మీ దేహం చెప్పినట్టు వినాలి. మీ దేహం సరిపోతుంది అనిచెబుతుంది. కానీ ఈ మనసుకి రుచి అలవాటు ఉంటుంది. కూర బాగోలేనప్పుడు సరిపడా తింటాం, కూర బాగున్నప్పుడే ప్రమాదం. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే ఈ ఆధ్యాత్మిక సాధనలో నూటికి యాభై మార్కులు మనకి వచ్చేస్తాయి. రమణమహర్షి గారు అంటూ ఉండేవారు అన్ని నియమాలలోకి ఆహార నియమం ఉత్తమమైనది. శరీరానికి అనారోగ్యం ఉంటే అస్తమానూ శరీరమే జ్ఞాపకం వస్తుంది. మనస్సులో చింత ఉంటే అస్తమానూ మనస్సే జ్ఞాపకం వస్తుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలి అంటే ముందు దేహాన్ని, మనసుని మర్చిపోవాలి.

Shakespeare చిన్న చిన్న గొడవల మీదకి మీ మైండ్ పెట్టకండి అన్నాడు. కొంతమంది వాడు తిట్టాడు, వీడు కొట్టాడు, మా తోటి కోడలు ఇలా అంది, మా ఆడపడచు అలా అంది అని రోజూ తలపెట్టుకుంటూ కాలక్షేపం చేస్తూ ఉంటారు. అటువంటి చిన్న చిన్న గొడవల మీద మీ మైండ్ పెడితే మీ పురోగతి ఆగిపోతుంది అన్నారు Shakespeare. రెండవది మీరు

మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఏది ఎప్పుడు మాట్లాడాలో, ఎక్కడ మాట్లాడాలో తెలిసి ఉండి మాట్లాడాలి. కొంతమంది శబ్దానికి అర్థం చెబుతున్నారు కానీ ఆ శబ్దానికి సంబంధించిన అనుభవం వారికి లేదని స్పష్టంగా తెలుస్తుంది. అంటే ఒక మాట మనం చెప్పకునేటప్పుడు చెప్పేవాడికి ఆ మాటకి సంబంధించిన అనుభవం లేనప్పుడు వినేవాడి మీద దాని ప్రభావం ఉండనే ఉండదు. అంటే చిలక పలుకులు అంటారు. మాటల విషయంలో బహు జాగ్రత్తగా ఉండాలి, సాధ్యమైనంత వరకు తక్కువ మాట్లాడడం మంచిది. మూడవది నిద్రలో అతి పనికి రాదు. ఆహారానికి, నిద్రకి చాలా సంబంధం ఉంది. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే నిద్రని కూడా మనం జయించవచ్చు. ఇంతకీ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఆహారంలో కానీ, మాటల్లో కానీ, నిద్రలో కానీ అతిగా ఉండవద్దు, extremesకి వెళ్ళద్దు, మధ్యేమార్గం అవలంభించమని చెపుతున్నారు. అందుచేత నిద్ర అతిగా ఉంటే మీకు సాధనకి టైము ఉండదు. ఆహారం ఎక్కువ అయితే నిద్ర కూడా ఎక్కువ అవుతుంది. మీకు సబ్జెక్టు అర్థం అవుతుంటే ఇప్పడే వస్తుంది మోక్షం. అర్థం చేసుకోవటం కూడా ఒక యోగం. భక్తి యోగం ఎటువంటిదో, కర్మ యోగం ఎటువంటిదో అర్థం చేసుకోవడం కూడా ఒక యోగమే. మీరు తిన్న అన్నం జీర్ణం అయితే మీ శరీరానికి ఎంత సుఖంగా ఉంటుందో, విన్న విషయం కూడా అర్థం అయితే మీకు అంత సుఖాన్ని కలుగజేస్తుంది అది, అందుచేత అర్థం లేని చదువు వ్యర్థం అంటారు, మీకు అర్థం అవుతుంటే అది మీకు పట్టు ఇస్తుంది. ఇప్పడే, ఇక్కడే మీకు ఆ సుఖం అందుతుంది. పిరికితనం అజీర్తి రోగం లాంటిది. అజీర్తి రోగం ఉన్న వాళ్ళు మాములుగానే తింటారు కానీ ఎప్పుడూ నీరసంగా ఉంటారు. పిరికితనం కూడా అటువంటిదే. ఆ పిరికితనం ఉన్న వాళ్లకి విన్నా పట్టు ఇవ్వదు.

మనసుని ఎప్పడూ ప్రేమతో నింపుకోండి. ఇది మటుకు మీరు జ్ఞాపకం పెట్టుకోండి. ఇతరులు ఎటువంటివారు ఇదంతా వద్దు, అది ఈశ్వరుడు చూసుకుంటాడు. మనం పుట్టక ముందు ఈ ప్రపంచం ఉంది, మన శరీరం చనిపోయాక ఈ ప్రపంచం ఉంటుంది. ఈ ప్రపంచానికి కంట్రోలర్ ఒకడు ఉన్నాడు, ఆయన చూసుకుంటూ ఉంటాడు. మనం మటుకి దేహాన్ని పవిత్రంగా ఉంచుకోవాలి, మనసుని ప్రేమతోటి నింపుకోవాలి. బిందె నిండా ఏ విధంగా అయితే నీళ్ళు నింపుకుంటామో, మన మనస్సు నిండా ప్రేమ తోటి నింపుకోవాలి, శాంతి తోటి నింపుకోవాలి. ఇంకొక్క విషయం మీరు జ్ఞాపకం పెట్టుకోండి మనలని మనం బాగు చేసుకుంటే ఇతరులని కూడా మనం బాగు చెయ్యగలం. కానీ మనలని మనమే బాగు చేసుకోలేనప్పడు ఇతరులను ఎలా బాగు చేయగలం? మనకే శాంతి లేనప్పడు ఇతరులకి శాంతి ఎలా ఇవ్వగలం? ఎదుటి వాడు ఏదైతే పొందాలి అనుకుంటున్నావో అది

నువ్వు పొందు. ఈ లోకానికి ఎలా ఉపకారం చెయ్యటం అని చాలామంది అంటారు. ముందు వాడికి వాడు ఉపకారం చేసుకుంటే తరువాత లోకానికి ఉపకారం చెయ్యవచ్చు. ముందు మనల్ని మనం సంస్కరించుకుంటే ఇతరులను సంస్కరించగలం. మనలో శాంతి ఉంటే ఆ శాంతి ఇతరులకి ఇవ్వగలం. మనం శాంతిని పొందితే, మనం సుఖాన్ని పొందితే, ఆ సుఖ స్థానాన్ని పొందితే మనలో ఉన్న సుఖం, శాంతి ఇతరులకి కూడా ప్రవహిస్తుంది. మనమే ఆ సుఖ స్థానాన్ని పొందనప్పుడు ఇతరులకి ఏమి ఇవ్వగలం? మనలో something ఉంటే ఎదుటివారికి ఏమైనా ఇవ్వగలం. మనమే nothing అయినప్పుడు ఇతరులకి ఏమి ఇవ్వగలం? అందుచేత నువ్వు ప్రయత్నం చేసి, సాధన చేసి ఆత్మసుఖాన్ని పొందు అంటున్నారు.

**అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల**

**అరుణాచల మనుచుస్మరియించువారలయహమునిర్మూలింపుమరుణాచలా**

**అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల**

**ఓం నమోనారాయణాయ**

పాల సముద్రాన్ని మథిస్తే అమృతం వచ్చింది, శబ్ద సముద్రాన్ని మథిస్తే ఓంకారం వచ్చింది.

**ఓం నమోనారాయణాయ**

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

**ఓం నమఃశ్శివాయ**

**ఓం నమో వేంకటేశాయ ఓం నమో వేంకటేశాయ**

**ఓం నమో వేంకటేశాయ ఓం నమో వేంకటేశాయ**

**ఓం ఓం ఓం ఓం ఓం శాంతిః శాంతిః శాంతిః**


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# సద్గురు జయంతి

సద్గురు శ్రీనాన్నగారి జయంతిని దిll 23-09-2023న జరుపుకోబోతున్నాం. భగవాన్ శ్రీరమణమహర్షిచే ఎన్నుకోబడి, జిన్నూరు కేంద్రముగా దేహయాత్ర సాగించి, తాను భౌతిక శరీరాన్ని చాలించేవరకు దేశ, విదేశముల నుండి అనేకమంది జిజ్ఞాసువులను ఆకర్షించి, అంతిమ సత్యంలోనికి మేల్కొలిపారు. నిరంతరం, నేటికి మేల్కొలుపుతూనే ఉన్నారు. అనేకమంది సామాన్యులవలె అతి నిరాడంబరంగా జీవించిన సామాన్య వ్యక్తి. ఆయనకు వ్యక్తిగత జీవితం లేదు. ఆయన ప్రాణం, ఆయన శ్వాస, భగవాన్ శ్రీరమణమహర్షియే. మనబోటివారి అనేక వేలమంది పుణ్య భాగ్యమే సద్గురు శ్రీనాన్నగారిని మన మధ్య, మన ప్రాంతములో అవతరించినట్లు చేసింది. మన ఆధ్యాత్మిక ప్రగతికి మార్గము సుగమం చేసి, మన అజ్ఞానాన్ని తొలగించడానికే శ్రీనాన్నగారు దేహం ధరించి భగవాన్ శ్రీరమణునిచే ఎన్నుకోబడ్డారు. వారి దైనందిన జీవితం చాలా సరళముగాను, క్రమబద్ధమైనదిగాను ఉండేది. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వారి దర్శనమునకై వచ్చిన భక్తులతో సంభాషణ జరుపుతూ, వారిని ఆశీర్వదించి, అంతిమ సత్యంలోకి మేల్కొను విధముగా గురిపెట్టేవారు. వారి దివ్యవాణిని వినుటకు ఎంతోమంది భక్తులు వచ్చేవారు. సాధకుల బలహీనతలను దృష్టిలో పెట్టుకొని అతి సరళముగాను, సూటిగాను, ప్రేమతత్త్వంతోను బోధించేవారు. భగవాన్ శ్రీరమణుని బోధను, సందేశాన్ని మనకు అందించిన వారధి సద్గురు శ్రీనాన్నగారు. సకల శాస్త్ర సారమే శ్రీనాన్నగారి బోధ. అట్టి బోధను మనము విని, ఆచరిస్తే మనలను బంధవిముక్తులను చేస్తుంది. మనము స్వస్థితిని పొందాలంటే వారు చెప్పినది ఆచరించి, అహంకారం లేకుండా జీవించాలి. సద్గురు శ్రీనాన్నగారి ప్రవచన తీరు చాలా స్పష్టంగా, సహజంగా, సరళంగా ఉంటూ హృదయాన్ని తాకేది. వారి దివ్య జ్ఞానబోధను ఆస్వాదించిన భక్తులు ధన్యులు. సాధన పేరుమీద మన నెత్తిన క్రొత్త బరువు పెట్టక, ఉన్న బరువును దించడానికే చూచేవారు. మన అహంకారమే అసలు బరువు, అట్టి అహంకారాన్ని అనగా వ్యక్తిని ఖాళీ చేయించే క్రమంలోనే ఉండేది వారి ఉపదేశమంతా. సద్గురువు అంటే మానవ దేహం ధరించిన పరమాత్మ. గురువు, దేవుడు ఒక్కరే కనుక 'గురుదేవుడు' అంటారు. గురువు యొక్క కృపాదృష్టే శిష్యుని ఉన్నతికి సోపానం. సద్గురు జీవిత విధానమే మానవాళికి ఆదర్శప్రాయం. వారి నిరహంకార జీవితమే ఒక ఉపదేశం. పరమ చైతన్యమే దక్షిణామూర్తిగా, శంకరునిగా, శ్రీరమణమహర్షిగా, సద్గురు శ్రీనాన్నగారిగా అవతరించింది. మన పరమ తండ్రి శ్రీనాన్నగారి జ్ఞాన సంపదకు మనమందరమూ వారసులమే! వర్షము వలన చెట్లు పుష్పించురీతిని, చిల్లగింజ వలన బురద నీరు నిర్మలమగురీతిని సద్గురుబోధ, సత్సంగము వలన పరమపద ప్రాప్తికి కారణమగు 'చిత్తశుద్ధిని' పొందుతాము. సద్గురు శ్రీనాన్నగారి జ్ఞానబోధ మనందరికీ ఆచరణీయము.

**(సద్గురు శ్రీ నాన్న చరణారవిందార్పణమస్తు)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురు స్థానం - శివ స్థానమే

మంచి పని చెయ్యబోయే ముందు శ్రీ గురుచరణాలను ధ్యానం చెయ్యాలి. ఇది సనాతన సాంప్రదాయం. ఆయన పాదాలలో సర్వతీర్థాలు ఉన్నాయి. ఆయన ముఖమే వేదం. దాన్ని చూస్తే అన్ని వేదాలు పారాయణం చేసినట్లే. ఆయన కళ్ళు అమృతమయాలు, ఆయన చూపు వల్ల యోగామృతం మనలో ప్రవేసిస్తుంది. పాదాలు మొదలుకొని శిరస్సు వరకూ ధ్యానం చేస్తే అన్ని విఘ్నాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయి. గురువు రూపాతీతుడు, కాలాతీతుడు, గుణాతీతుడు అనే భావన వారి కళ్ళలోకి చూస్తే నిజ భక్తుడు గ్రహిస్తాడు. మనలో పరిశుద్ధత పెరిగేకొద్ది మన చిన్నచిన్న అర్పణలు ఆయనకు మరింత ఆనందం కలిగిస్తుంది. పూజలందుకొనే శక్తి గురువుకే ఉంటుంది. గురువుకన్న అధికమైనది ఏదీ లేదు ఇది శివుని శాసనము. కబీర్ "సద్గురువు సాయం చేసిననాడు, గుణాలు, ఇంద్రియములలో మదం అంతా పోతుంది. దేహంలో నామం వెలుగుతుంది. ఆపదలు అరచి, అరచి చస్తాయి" అన్నారు. ఉత్తమ సాధకులు సత్యాన్ని వారు నిజాయితీగా అన్వేషిస్తారు. గురువు వద్ద నుంచి చిన్న సంకేతం దొరికితే సరిపోతుంది. గురువు మన కళ్ళల్లోకి చూస్తే సరిపోతుంది. ఆయన మనవారైపోతారు. మనం వారి వారమైపోతాము. మనం గురువును గాఢంగా ప్రేమిస్తే ఆయన శరీరం కన్న భిన్నంగా పరమాత్మగా ఉంటారు. గురువు యొక్క చివరి ప్రయత్నం మనకు మధ్యవర్తులు లేకుండా భగవంతునికి ముఖాముఖి నిలవాలని వారి ఇచ్ఛ, కర్తవ్యం. కాని అది అంతా తొలగిపోయే వరకూ మనముందు ఉంటాడు. తొలగిపోయిన తరువాత గురువు తనకు తానుగానే తొలగిపోతాడు. రామకృష్ణునికి తోతాపురి చేసే చివరి ప్రక్రియ ఇదే. "అప్పుడు సృష్టి మొత్తం ప్రేమ స్వరూపమవుతుంది అని తెలుస్తుంది. అలాంటి ద్రవ్యాన్నే ప్రేమ అంటారు" పెద్దలు. "స్వామీ మిమ్ములను ధ్యానించే శక్తిని అనుగ్రహించండి" అని మన గురువును శక్తికొలది ప్రార్థన చేస్తే సర్వశక్తులు సంపాదించుకోవచ్చు. కుమ్మరివాడు కడవను చెయ్యటానికి తడి మట్టిని తట్టి తట్టి వంకర్లు తీర్చటానికి లోపలికి చెయ్యి ఊపుగా నిచ్చి పైన చేతితో కొడతాడు. అలాగే గురువు తన మండలిలోని శిష్యుల కర్మభారాన్ని ప్రారబ్ధంలోని సంకటాలను మన ముందు పడేసి మానసికంగా, శారీరకంగా అనుభవింపచేసి సుందరంగా, సుమధురంగా తీర్చిదిద్దుతాడు. మరి అలాంటి గురువుని సాధకుడు ఎలా గ్రహిస్తాడు అంటే ఆయన కళ్ళలో కాంతి, రూపం చుట్టూ అనంతమైన శాంతి, సమ్మోహకరమైన చిరునవ్వు అవ్యాజమైన ప్రేమ ఇలా ఎన్ని చెప్పినా అది జన్మజన్మల హృదయసాధనా ధర్మమే. అసలు కారణం రెండు వీణల శృతి ఒక్కటైతే నాదం తక్షణం కార్యోన్ముఖమవుతుంది. సజీవ సద్గురువు ద్వారా పూర్తి సహాయం అందుతుంది. ఈతరానివాడు నదిని దాటాలంటే నేర్పరియైన గురువు నీళ్ళలోకి దిగి అతన్ని కూడా తీసుకొని ఊపిరి బిగబెట్టటంలాంటి ప్రక్రియలను నేర్పుతాడు. అలాగే జీవుని ప్రాణప్రయాణ ప్రవాహమనే నదిని దాటటానికి ఆత్మ విద్య ద్వారా గురువు బోధిస్తాడు. అది మన గ్రహణశక్తి మీద ఆధారపడి ఉంటుంది. గురువును మనలోకి ప్రవేశింపచెయ్యాలి అప్పుడు శాంతి తీరానికి చేరిపోతాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**